


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 95 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) పచురణ : తాడేపల్లిగూడెం ఆదివారం 15 ఫిబ్రవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 95 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM SUN 15 FEBRUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

## ఏపీ బడ్జెట్ ₹3,32,205 కోట్లు

### అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్



2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను ఏపీ శాసనసభలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. రూ. 3,32,205 కోట్లతో బడ్జెట్ ను ప్రవేశపెడుతున్నట్టు ఆర్థిక మంత్రి తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిని, ప్రజా సంక్షేమాన్ని జోడెద్దుల బండిలా పరుగులు పెట్టించాలనే సంకల్పంతో ఈ బడ్జెట్ ను రూపొందించామని చెప్పారు.

- రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం లక్ష్యంతో బడ్జెట్ రూపొందించామన్న పయ్యావుల
- రెవెన్యూ వ్యయం రూ.2,56,143 కోట్లు
- అమరావతి నిర్మాణానికి రూ. 6 వేల కోట్లు
- విశాఖ ఆర్థిక ప్రాంతానికి రూ 28 వేల కోట్లు
- రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కు రూ. 30 వేల కోట్లు



2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్ర బడ్జెట్ ను ఏపీ శాసనసభలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్వర్ణాంధ్ర 2047కు అనుగుణంగా బడ్జెట్ ను రూపొందించామని తెలిపారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తమ విధానమని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం ఉందని తెలిపారు. రాష్ట్రాన్ని విధ్వంసం నుంచి వికాసం వైపుకు తీసుకెళు తున్నామని పయ్యావుల చెప్పారు. రాయలసీమ రైతుల కలలను ఈ బడ్జెట్ సాకారం చేస్తుందని అన్నారు. శ్రీకాకుళం జిల్లా యువతకు గుండె నిబ్బరాన్ని ఇస్తుందని చెప్పారు. తొమ్మిది జిల్లాలతో అమరావతి ఆర్థిక ప్రాంతాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు.



### శాఖల వారీగా కేటాయింపులు

| | |
|---|---|
| పాఠశాల విద్యాశాఖ | రూ.32,308 కోట్లు |
| పంచాయతీరాజ్ | రూ.22,942 కోట్లు |
| వ్యవసాయం,అనుబంధ రంగాలు | రూ.13,598 కోట్లు |
| అన్నదాత సుఖీభవ | రూ.6,660 కోట్లు |
| పోలవరం | రూ.6,105 కోట్లు |
| హోంశాఖ | రూ.9,165 కోట్లు |
| మున్సిపల్ శాఖ | రూ.14,539 కోట్లు |
| అమరావతి | రూ.6 వేల కోట్లు |
| విద్యుత్ రంగం | రూ.13,934 కోట్లు |
| రోడ్లు,పోర్టు, ఎయిర్‌పోర్టులు | రూ.13,546 కోట్లు |
| పరిశ్రమలు | రూ.3,161 కోట్లు |
| సర్దుబాటు నిధి | రూ.1,500 కోట్లు |
| వీబీ జీరామ్ జీ | రూ.8365 కోట్లు |
| గృహ నిర్మాణం | రూ.5,451 కోట్లు |
| ఎన్టీఆర్ వైద్యసేవ | రూ.4,000 కోట్లు |
| జల్ జీవన్ | రూ.4,000 కోట్లు |
| స్వచ్ఛ భారత్ మిషన్ | రూ.1,037 కోట్లు |
| విశాఖ ఆర్థిక ప్రాంతం | రూ.28,000 కోట్లు |
| రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ | రూ.30,000 కోట్లు |

### ప్రతి జిల్లాకు ప్రత్యేక సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్

| | |
|---|---|
| జలవనరుల శాఖ | రూ.18,224 కోట్లు |
| హాస్టళ్లు, గురుకులాలు | రూ.300 కోట్లు |
| స్కాలర్ షిప్పు | రూ.3,836 కోట్లు |
| మధ్యాహ్న భోజన పథకం | రూ.2,161 కోట్లు |
| ఎన్టీఆర్ భరోసా | రూ.27,719 కోట్లు |

## ఉండవల్లిలో 'ఇల్లే వేదిక'..

### నేతలతో కలిసి భోజనం చేసిన నారా లోకేశ్...



- ఉండవల్లిలో ప్రజాప్రతినిధులతో మంత్రి లోకేశ్ సమావేశం
- గుంటూరు, విజయవాడ నేతలతో ఆత్మీయ కలయిక కార్యక్రమం
- సమస్యల పరిష్కారంపై నేతలకు నివేదిక అందజేత
- హాజరైన మహిళలకు మంగళగిరి చేనేత చీరల బహూకరణ

పెన్ పవర్ డెస్క్:రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ప్రజాప్రతినిధులతో నిర్వహిస్తున్న 'ఆత్మీయ కలయిక – ఇల్లే వేదిక' కార్యక్రమం కొనసాగుతోంది. ఇందులో భాగంగా శనివారం మధ్యాహ్నం ఉండవల్లిలోని తన నివాసంలో గుంటూరు, విజయవాడ పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వారి కుటుంబ సభ్యులతో

- మిగతా 2లో...



## బంగ్లాదేశ్ ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యం

- విజయం అనంతరం తొలి ప్రసంగం చేసిన తారిఖ్ రెహ్మన్
- బంగ్లాదేశ్ ప్రజలకే ఈ విజయం చెందుతుందన్న బీఎన్‌పీ అధినేత
- హక్కులకు అసలైన అర్థాన్ని తిరిగి సంపాదించుకుందామన్న తారిఖ్ రెహ్మన్

పెన్ పవర్ డెస్క్:బంగ్లాదేశ్ ప్రయోజనా లకే తొలి ప్రాధా న్యం ఇస్తామని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) ఛైర్మన్ తారిఖ్ రెహ్మన్ పేర్కొన్నారు.

- మిగతా 2లో...




## నరవణే పుస్తకం ఎఫెక్ట్... కీలక నిర్ణయం దిశగా కేంద్రం

- పుస్తకాల విషయంలో కొత్త నిబంధనపై కేంద్రం చర్చ
- 20 ఏళ్ల కూలింగ్ ఆఫ్ పీరియడ్ నిబంధన తేవాలని భావిస్తున్న కేంద్రం
- రిటైర్ అయ్యాక 20 ఏళ్ళ వరకు సున్నిత అంశాలపై పుస్తకాలు రాయకూడదనే నిబంధన

పెన్ పవర్ డెస్క్:మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణె రచించిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకం వివాదం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక

- మిగతా 2లో...



## ఏపీ లిక్కర్ స్కామ్ లో మరో కేసు నమోదు చేసిన సీఐడీ

- డిపోల నుంచి మద్యం దుకాణాలకు సరఫరా చేసే టెండర్లలో అక్రమాలు
- రూ. 200 కోట్ల నుంచి రూ. 400 కోట్ల వరకు అక్రమాలు జరిగినట్టు సమాచారం
- విచారణ బాధ్యతలు సిట్ చీఫ్ రాజశేఖర్ బాబుకు అప్పగింత

పెన్ పవర్ డెస్క్:ఏపీ రాజకీయాలను కుదిపేస్తున్న లిక్కర్ స్కామ్ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో

- మిగతా 2లో...



## ఆ ముగ్గురి పేర్లు పదిసార్లు చదివారు... అంతకుమించి బడ్జెట్‌లో ఏముంది?

- కూటమి బడ్జెట్‌లో నాయకుల పేర్లు తప్ప కేటాయింపులు లేవన్న బొత్స
- మహిళలకు సున్నా వడ్డీ పథకాన్ని రద్దు చేసి మోసం చేశారని విమర్శ
- ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించి నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపణ
- రాష్ట్ర అప్పుల లెక్కలు పూర్తిగా తప్పుల తడకగా ఉన్నాయని వ్యాఖ్య
- ఈ బడ్జెట్ ప్రజల ధైర్యాన్ని, స్థైర్యాన్ని దెబ్బతీసిందని తీవ్ర విమర్శ

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై శాసనమండలి మీడియా పాయింట్ వద్ద ప్రతిపక్ష నేత, వైసీపీ సీనియర్ నాయకుడు బొత్స సత్యనారాయణ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆత్మస్తుతి... పరనింద అన్నట్టు

- మిగతా 2లో...

## ఫార్ములా ఈ కార్ రేస్‌లో కీలక పరిణామం..

### అరవింద్ కుమార్ ప్రాసిక్యూషన్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్



పెన్ పవర్ డెస్క్: ఫార్ములా ఈ కార్ రేస్‌లో కీలక పరిణామం జరిగింది. ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ ప్రాసిక్యూషన్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చింది. ప్రాసిక్యూషన్‌కు అనుమతిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ప్రాసిక్యూషన్ విషయంపై రాష్ట్రానికి కేంద్రం సమాచారం ఇచ్చింది. ఫార్ములా ఈ కార్ రేసుపై ఇప్పటికే ఏసీబీ విచారణ జరుగుతున్న సంగతి తెలిసిందే. మరోవైపు ఇప్పటికే కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు కూడా గవర్నర్ అనుమతి ఇచ్చారు.

- మిగతా 2లో...

## మున్సిపల్ పోరులో 'హస్తం' జోరు

### ప్రజల నమ్మకానికి నిదర్శనమన్న రాహుల్, ఖర్గే!




పెన్ పవర్ డెస్క్:: మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించడం పట్ల పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయం రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉంచిన నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ మేరకు ఇవాళ రాహుల్ ఎక్స్ వేదికగా తెలంగాణ కాంగ్రెస్ కార్యకర్తలకు అభినందనలు తెలిపారు.

- మిగతా 2లో...



## ఇమ్రాన్ ఖాన్ కంటిచూపు కోల్పోయే ప్రమాదం...

### సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

- ఇమ్రాన్ ఖాన్ జైలు జీవితంపై అమికస్ క్యూరీ సంచలన నివేదిక
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో కంటిచూపు కోల్పోతున్నారని వెల్లడి
- కుడి కంటి చూపు 15 శాతానికి పడిపోయిందని నివేదికలో స్పష్టీకరణ
- వ్యక్తిగత వైద్యులతో చికిత్సకు అనుమతించాలని సుప్రీంకోర్టు ఆదేశం
- వైద్య కారణాలతో బెయిల్ కోసం ఇస్లామాబాద్ హైకోర్టులో పిటిషన్

పెన్ పవర్ డెస్క్:పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ జైల్లో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారని, ఆయన తన కంటిచూపును కోల్పోయే ప్రమాదంలో ఉన్నారని వెల్లడైంది. ఇమ్రాన్ జైలు పరిస్థితులపై

- మిగతా 2లో...

## అప్పు ఎంత ఉందో చెప్పలేదు: బడ్జెట్ పై బుగ్గన విమర్శలు

- బడ్జెట్ స్పీచ్ లో అన్నీ అబద్ధాలే చెప్పారన్న బుగ్గన
- గత బడ్జెట్ బుక్ ను మళ్లీ చదివినట్టు ఉందని వ్యాఖ్య
- వైసీపీ హయాంలో 9 శాతం వృద్ధి సాధించామని వెల్లడి



పెన్ పవర్ డెస్క్:ఏపీ శాసనసభలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ పై వైసీపీ నేత, రాష్ట్ర మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ స్పీచ్ లో అన్నీ అబద్ధాలే చెప్పారని

- మిగతా 2లో...

## ఏపీ బడ్జెట్‌పై మాజీ ఆర్థిక మంత్రి యనమల ఏమన్నారంటే...!

- ఏపీ బడ్జెట్ 2026-27పై యనమల రామకృష్ణుడు కామెంట్స్
- ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే బడ్జెట్ అని కితాబు
- ఆర్థిక క్రమశిక్షణ, రుణ నియంత్రణకు ప్రాధాన్యం
- పరిశ్రమలు, పెట్టుబడులకు పెద్దపీట వేయడంపై హర్షం
- సామాజిక న్యాయం దిశగా బడ్జెట్ రూపకల్పన జరిగిందని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ 2026-27 వార్షిక బడ్జెట్‌పై టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు ప్రశంసలు కురిపించారు. ఇది ప్రజల ఆశలను, ఆకాంక్షలను నెరవేర్చే బడ్జెట్ అని అభివర్ణించారు. ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ, దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని బడ్జెట్‌ను రూపొందించారని అభినందించారు. ఈ సందర్భంగా యనమల స్పందిస్తూ... "బడ్జెట్‌లో

- మిగతా 2లో...



## ఎడిటర్ వ్యూ

# తెలుగునేలపై శైవమత వ్యాప్తి

చారిత్రక యుగమున శాతవాహన, చాళుక్య, రాష్ట్రకూట, కాకతీయ, అనంతర కాలమున హైందవ సంస్కృతీ సభ్యతలకు ఆలవాలమైన తెలుగు నేలలో వివిధ రాజన్యుల ఏలుబడులలో శైవమతం పరిడవిల్లింది. క్రీ.పూ. 2వ శతాబ్ది నాటికే తెలుగు నేలలో శైవారాధన ఉంది. గాథా సప్తశతిలో గౌరీ, పశుపతి స్తోత్రముంది. 1వ శతాబ్దంలో శైవంలో అత్యంత ప్రాచీనమైన పాశుపత శైవాన్ని లకులీస శివాచార్యుడు స్థాపించారు. చేతికందుతున్న చరిత్ర ఆధారంగా శ్రీముకుడు కాణ్వ రాజైన సుశర్మను వధించి, మగధను ఆక్రమించి, శాతవాహన రాజ్యాన్ని స్థాపించాడని, వివిధ చరిత్రకారుల అభిప్రాయాన్ని అనుసరించి, శ్రీ.పూ. 1వ శతాబ్దిగా స్పష్టమవుతున్నది. శ్రీముకుడు జైన మతాన్ని స్వీకరించి, అనేక ఆలయాలను నిర్మించాడు. శాతవాహన 17వ రాజైన హాల చక్రవర్తి, సింహళ రాకుమారి లీలావతిని సప్త గోదావరీ తీరస్థ భీమేశ్వరాలయం, నేటి జగిత్యాల జిల్లాలోని వేంపెల్లి వెంకటరావుపేటలో వివాహ మాడినట్టు నాటి భీమేశ్వరాలయం ఉన్నట్లు నిరూపితమైంది. బౌద్ధమతంలోనూ నాగదేవత అరాధన ఉంది. స్థూపాలను పెనవేసుకున్న నాగ సర్పాల చిత్రాలు ప్రధానంగా ధూళికట్ట స్థూపంపై ఐదుతలల నాగ ముచిలింద శిల్పాన్ని చూడవచ్చు. ఇక్ష్వాకు (క్రీ.శ.253, 277) రాజైన ఎహువల శాంతమూలుని సేనానియైన ఎలిశ్రీ ఏలేశ్వరం నిర్మించి, సర్వదేవాలయమనే శివాలయాన్ని నిర్మించాడు. ఆయన కాలంలో విజయపురిలో కార్తికేయ, పుష్పభద్ర స్వామి, నోడిగిరీశ్వర, దేవీ ఆలయాలు నిర్మితాలై నాయి. ఇక్ష్వాకుల కాలంలో మాతృ దేవతారాధన కూడా ఉండేది. నాగార్జున కొండలో హారీతి ఆలయం నిర్మించ బడింది. ఆలయంలో సప్తమాతృకల వద్ద గాజులను సమర్పించే వారని శాసనాధారం. వీరికాలంలో స్కంద గణపతి, యక్షుడు, హారీతి దేవత లను పూజించేవారు. అనంతర వాకాట రాజులలో అధికులు శైవులు. మొదటి రుద్ర సేనుడు మహా భైరవుని భక్తుడు కాగా, మొదటి పృథ్వీసేనుడు మహేశ్వర భక్తుడు. క్రీ.శ.358నుండి 569వరకు 210 ఏళ్ళు తెలంగాణను, ఉత్తరాంధ్రను పాలించిన విష్ణుకుండినులు నేటి మహబూబ్ నగర్ జిల్లాలోని అమ్రాబాద్ (అమల పురం), నల్గొండ జిల్లాలోని వలిగొండ మండలం లోని ఇంద్రపాల నగరం. కొంతకాలం బెజవాడను రాజధానిని చేసుకున్నారు. వీరు బ్రాహ్మణ మతావ లంబులు, శివభక్తులు. రెండవ మాధవవర్మ (క్రీ.శ.440–495) 100కుపైగా యుద్ధాలు చేసి, విజయాలు సాధించి, ఒక్కొక్క విజయానికి గుర్తుగా కీసర గుట్టపైన ఒక లింగ ప్రతిష్ఠ చేశాడు. విజయం సాధించిన చోటల్లా రామలింగేశ్వర ఆలయం కట్టించాడు. శ్రీశైలం మల్లికార్జునునికి చంద్రగుప్తుడు అనే రాజు బంధువైన చంద్రవతి ప్రతి ష్ఠించినదని చెపుతున్న గుప్త మహేశ్వర ఆలయ శిథిలాలు, నేటికీ శ్రీశైల ఉత్తర ద్వార క్షేత్రమైన ఉమా మహేశ్వరానికి ఉత్తరాన ప్రతాప రుద్ర కోటకింద వాయవ్య మూలన రోడుకు దక్షిణాన ఉన్నాయి. శ్రీశైల మల్లికార్జునుడు విష్ణుకుండినుల కాలంలోనే బహుళ ప్రచారం పొందాడు. గోవింద వర్మ అనేక దేవాలయాలు కట్టించాడు. 2వ మాధవ వర్మ అనేక రామ లింగేశ్వరాలయాలు కట్టించాడు. గుంటూరు జిల్లా లోని సత్తెనపల్లి తాలూకా వేల్పూరులో, ఈ ఊరులో, కీసరగుట్టలో రామలింగే శ్వరాలయాలు నేటికీ దర్శనీయ స్థలాలే. తూర్పు చాళుక్య 2వ విజయాదిత్యుడు 108 విజయాలకు గుర్తుగా 108 భీమేశ్వరాలయాలు నిర్మించాడు. జైన మతం విష్ణుకుండినుల కాలంలోనే దాదాపు కనుమరుగు కాగా, జైన ఆలయాలు శివాలయాలైనాయి. అలంపురం విష్ణుకుండినుల కన్నా ముందువారైన ఇక్ష్వాకుల నుంచే మనుగడలో ఉండేదని శాసనాధా రంగా ఉంది. వేములవాడ చాళుక్యులు, వేములవాడలో నిర్మించిన రాజరాజేశ్వరాలయం తెలంగాణ లోని ప్రముఖ శివాలయం. బద్దెగ (క్రీ.శ.850–895) వేములవాడలో బద్దెగేశ్వర (భీమేశ్వర) ఆలయాన్ని నిర్మించాడు. క్రీ.శ.7వ శతాబ్ది శాసనంలో శివమండల దీక్ష ప్రసక్తి ఉంది. శ్రీశైలం, అలంపురం, బెజ వాడ, పిఠాపురం నాటి శక్తి పూజా కేంద్రాలు. బసవేశ్వరుడు (క్రీ.1100–70) వీర శైవోద్యమాన్ని ప్రారంభించాడు. అనంతరం మల్లికార్జున పండితుడు శైవాన్ని ప్రచారం చేశాడు. చాళుక్య భీముడు ద్రాక్షారామంలో భీమేశ్వరాలయం నిర్మించాడు. భీమవరం, పాలకొల్లు, అమరావతి ఆలయాలు చాళుక్య నిర్మాణాలే. యుద్ధ మల్లుడు బెజవాడలో కుమారస్వామి, 2వ విక్రమాదిత్యుని భార్య మహాదేవి, పట్టడకల్ లో శైవాలయాన్ని నిర్మించారు. రాష్ట్రకూటుల కాలంలో ఎల్లోరా గుహలు మలుచ బడ్డాయి. కైలాసనాథ ఏక శిలాలయం మొదటి కృష్ణుని అద్భుత సృష్టి. కాలాముఖి, కాపాలిక తెగలు ప్రచారం లోకి వచ్చాయి. కాకతీయులు కాకతి మాతృదేవతారాధకులుగా అభిప్రాయాలున్నాయి. గ్రామదేవత యైన ఏకవీర ఆరాధన నాడు బహుళ ప్రచారంలో ఉంది. వీరికాలంలో జైన బౌద్ధ, వీరశైవుల మధ్య ఘర్షణలు తారాస్థాయికి చేరాయి. ఇందుకు భిన్నంగానే తిక్కన హరిహర తత్వాన్ని బోధించాడు. కాళేశ్వరంలో శివలింగ ప్రతిష్ఠ చేసింది 2వ ప్రోలరాజు గురువైన రామేశ్వర పండితుడు. కాకతీయ పరిపాలనలో ధర్మపురి, అనుమకొండ, ఐనవోలు, పానగల్లు, నందికంది, శనిగరం, పుష్పగిరి, అమరావతి, సామర్లకోట, భీమ వరం, పాలకొల్లు, ద్రాక్షారామం గొప్ప శైవక్షేత్రాలు. ఏకామ్రనాథుని ప్రతాపరుద్ర చరిత్రలో కాకతీయుల కాలంలో 5500 శైవాలయాలు, 1300 వైష్ణవాల యాలు, 2400 మల్లారదేవుని గుళ్ళ...భైరవ, దుర్గ గణపతి దేవుళ్ళవి కలిపి 4400 గుడులు ఉండేవని స్పష్టమవు తున్నది. వెలమరాజుల కాలంలో కాళిక, దుర్గ, చండి, భద్రకాళి, మహిశాసుర మర్ధిని, కట్టమైసమ్మ, ముత్యాలమ్మ, మారెమ్మ, ఏకవీర దేవతల ఆరాధన ఉన్నట్లు తెలుస్తున్నది.

# ఉండవల్లిలో 'ఇల్లే వేదిక'..

- మొదటి పేజి తరువాయి

ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన నేతలతో కలిసి ఆయన భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ స్పందిస్తూ... అందరూ కలిసి ఒకేచోట భోజనం చేస్తూ, మాట్లాడుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. ప్రజాప్రతినిధులు తన దృష్టికి తీసుకొచ్చిన వివిధ సమస్యలపై ఒక నివేదికను వారికి అందించినట్లు వివరించారు. వారు ఇచ్చిన విజ్ఞప్తులలో ఎన్ని పరిష్కరించబడ్డాయి, ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయో ఆ నివేదికలో స్పష్టంగా పేర్కొన్నట్లు చెప్పారు. ఈ ఆత్మీయ సమావేశానికి వచ్చిన మహిళలకు మంగళగిరి చేనేత చీరలను కానుకగా అందజేసినట్లు లోకేశ్ తెలిపారు.

గత కొన్ని రోజులుగా మంత్రి లోకేశ్ కూటమిలోని ప్రజాప్రతినిధులతో ఇలాంటి సుహృద్భావ సమావేశాలు నిర్వహిస్తుండటం ద్వారా పార్టీ శ్రేణులతో సంబంధాలను మరింత బలోపేతం చేసుకుంటున్నారని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

## ఏపీ లిక్కర్ స్కామ్ లో మరో కేసు నమోదు చేసిన సీఐడీ

- మొదటి పేజి తరువాయి

సీఐడీ అధికారులు మరో కేసు నమోదు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఏపీఎస్బీసీఐ డిపోల నుంచి ప్రభుత్వ మద్యం దుకాణాలకు సరఫరా చేసే రవాణా టెండర్లలో అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై తాజా కేసు నమోదయింది. ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లేలా వ్యవహరించారని కేసు నమోదు చేశారు. రవాణా టెండర్లలో రూ. 200 కోట్ల నుంచి రూ. 400 కోట్ల వరకు అక్రమాలను పాల్పడినట్టు సమాచారం. ఈ కేసు విచారణ బాధ్యతలను సిట్ చీఫ్ ఎస్పీ రాజశేఖర్ బాబుకు అప్పగించారు.

మరోవైపు, లిక్కర్ స్కామ్ లో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న రాజ్ కేసిరెడ్డి బెయిల్ పిటిషన్ ను ఇటీవల సుప్రీంకోర్టు తిరస్కరించిన సంగతి తెలిసిందే. ఈ కుంభకోణంలో రాజకీయ నాయకులు, అధికారుల ప్రమేయంపై కూడా సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఈ స్కామ్ లో రూ. 3,500 కోట్లకు పైగా అక్రమ లావాదేవీలు జరిగినట్టు సిట్ అధికారులు అంచనా వేశారు. ఈ కేసును ఈడీ కూడా దర్యాప్తు చేస్తోంది. పలువురు వ్యక్తులకు ఇప్పటికే నోటీసులు జారీ అయ్యాయి. ఈ కేసులో ఇప్పటి వరకు 12 మందిని అరెస్ట్ చేశారు. మరో 9 మంది విదేశాల్లో తలదాచుకున్నట్టు సిట్ అధికారులు తెలిపారు.

## ఆ ముగ్గురి పేర్లు పదిసార్లు చదివారు...
# అంతకుమించి బడ్జెట్‌లో ఏముంది?

- మొదటి పేజి తరువాయి

బడ్జెట్ ప్రసంగం సాగిందని విమర్శించారు. ఇది అంకెల గారడీతో కూడిన పసలేని బడ్జెట్ అని, ఇందులో చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ పేర్లను పదిసార్లు ప్రస్తావించడం తప్ప ప్రజలకు మేలు చేసే అంశాలు ఏవీ లేవని ఆయన దుయ్యబట్టారు. ఈ బడ్జెట్ ప్రజల్లో ఉన్న కొద్దిపాటి ధైర్యాన్ని, స్థైర్యాన్ని కూడా దెబ్బతీసిందని, ఇది మోసపూరిత పత్రమని ఆయన అభివర్ణించారు. బడ్జెట్‌పై జరిగిన చర్చలో బొత్స మాట్లాడుతూ, ప్రతి రంగంలోనూ ప్రభుత్వం ప్రజలను వంచిస్తోందని ఆరోపించారు.

మహిళా సాధికారతపై ప్రభుత్వం చేస్తున్న ప్రచారాన్ని బొత్స తీవ్రంగా తప్పుపట్టారు. ప్రతి ఇంట్లో ఒక మహిళను పారిశ్రామికవేత్తగా తయారు చేస్తామనడం హాస్యాస్పదంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. "గతంలో డ్వాక్రా సంఘాలను బలోపేతం చేసి, వారిలో పారిశ్రామిక స్ఫూర్తిని నింపడానికి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పావలా వడ్డీ పథకాన్ని తెచ్చారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు సున్నా వడ్డీని అమలు చేశాయి. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఒక్కరోజు కూడా ఆలస్యం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే సున్నా వడ్డీ డబ్బులు జమ అయ్యేవి. కానీ ఈ ప్రభుత్వం వచ్చి 19 నెలలైనా ఆ సున్నా వడ్డీ పథకం ఏమైందో తెలియదు. బడ్జెట్‌లో దానికి కేటాయింపులు లేవు. ఎలాంటి ఆర్థిక చేయూత లేకుండా మహిళలను పారిశ్రామికవేత్తలుగా ఎలా మారుస్తారో చంద్రబాబు చెప్పాలి. ఇది మహిళలను మోసం చేయడం కాదా?" అని బొత్స ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు.

గ్రామీణాభివృద్ధి, ఉపాధి హామీ పథకం (చీ=జు+నా) నిధుల కేటాయింపులోనూ ప్రభుత్వం కోత పెట్టిందని బొత్స ఆరోపించారు. "గతంలో ఉపాధి హామీ పథకం కింద 100 శాతం నిధులను కేంద్రమే భరించేది. ఇప్పుడు కేంద్రం నిబంధనలు మార్చి మెటీరియల్, లేబర్ కాంపోనెంట్లలో 40 శాతం వాటాను రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలని చెప్పింది. గత ప్రభుత్వాల హయాంలో ఏటా సగటున రూ. 5,000 కోట్లు ఈ పథకం కింద ఖర్చు చేసేవారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం రాష్ట్రం కనీసం రూ. 2,000 కోట్లు కేటాయించాలి. కానీ బడ్జెట్‌లో కేవలం రూ. 500 కోట్లు మాత్రమే చూపించారు. మిగిలిన బ్యాలెన్స్ సంగతేంటి? అంటే ఈ పథకాన్ని కూడా నీరుగార్చబోతున్నారా?" అని ఆయన నిలదీశారు.

రాష్ట్ర అప్పుల విషయంలోనూ ప్రభుత్వం వాస్తవాలను వక్రీకరిస్తోందని బొత్స ఆరోపించారు. రాష్ట్ర విభజన నుంచి వారసత్వంగా రూ. 9.46 లక్షల కోట్ల అప్పులు వచ్చాయని చెప్పడం సత్యదూరమని అన్నారు. "మా ఐదేళ్ల పాలనలో కార్పొరేషన్లతో కలిపి మేం చేసిన అప్పు కేవలం రూ. 3 లక్షల కోట్లు మాత్రమే. అంతకుముందున్న టీడీపీ ప్రభుత్వం రూ. 2.30 లక్షల కోట్ల అప్పు చేసింది. వాస్తవాలు ఇలా ఉంటే, అప్పుల భారాన్ని మాపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారు" అని బొత్స వివరించారు. ఈ బడ్జెట్‌లో కేవలం ప్రగల్భాలు తప్ప, నిర్దిష్ట కేటాయింపులు, ప్రజలకు భరోసా ఇచ్చే అంశాలు ఏవీ లేవని విమర్శించారు.

# మున్సిపల్ పోరులో 'హస్తం' జోరు

- మొదటి పేజి తరువాయి

స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రశంసనీయమైన విజయాన్ని అందించిన అంకితభావం కలిగిన క్షేత్రస్థాయి కార్యకర్తలకు నా కృతజ్ఞతలు. పీపుల్స్ తెలంగాణ నిర్మాణం దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. సామాజిక న్యాయమే లక్ష్యంగా కాంగ్రెస్ పయనిస్తుందని స్పష్టం చేశారు.

**ప్రజల నమ్మకానికి నిదర్శనం: మల్లికార్జున ఖర్గే**

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ప్రజల నమ్మకానికి నిదర్శనం అని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. పార్టీ గెలుపు కోసం క్షేత్రస్థాయిలో అహర్నిశలు శ్రమించిన కార్యకర్తలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ఎక్స్ లో పోస్ట్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృ ద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలు నమ్మకం ఉంచారని, ఆ నమ్మకమే ఈ ఎన్నికల ఫలితాల్లో ప్రతిబింబించిందని ఖర్గే పేర్కొన్నారు.

## నరవణే పుస్తకం ఎఫెక్ట్... కీలక నిర్ణయం దిశగా కేంద్రం

- మొదటి పేజి తరువాయి

నిర్ణయం తీసుకునే దిశగా ఆలోచన చేస్తోంది. మిలిటరీ అధికారులు, అత్యున్నత పదవుల్లోని వ్యక్తులకు సంబంధించిన పుస్తకాల విషయంలో కేంద్రం కొత్త నిబంధనలు తీసుకురావాలని భావిస్తోంది.ప్రస్తుతం పనిచేస్తున్న, పదవీ విరమణ చేసిన సాయుధ దళాల సిబ్బంది పుస్తకాలు రాయడానికి, ప్రచురించడానికి 20 సంవత్సరాల 'కూలింగ్ ఆఫ్ పీరియడ్' మార్గదర్శకాలను ప్రవేశపెట్టడాన్ని కేంద్రం పరిశీలిస్తోందని తెలుస్తోంది. ఆయా అధికారులు పదవుల నుంచి రిటైర్ అయిన తర్వాత ఇరవై సంవత్సరాల వరకు వారి పుస్తకాలు పబ్లిష్ కాకుండా తప్పనిసరిగా ఈ నిబంధనను అమలు చేయాలని కేంద్రం భావిస్తోందని తెలుస్తోంది.

ఇటీవల జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈ విషయం చర్చించారని ఆంగ్ల మీడియాలో వార్తలు వచ్చాయి. సీనియర్ సైనిక అధికారులతో సహా ఉన్నత పదవులు నిర్వహించిన వారు సున్నితమైన అంశాలపై పుస్తకాలు రాయడానికి తప్పనిసరి కూలింగ్ ఆఫ్ పీరియడ్ నిబంధనను తీసుకురావాలని ఎక్కువ మంది మంత్రులు సమర్థించారని తెలుస్తోంది. అయితే ఇది కేబినెట్ అధికారిక అజెండాలో భాగం కాలేదని, సాధారణ చర్చగా సాగిందని పేర్కొన్నారు.

## ఇమ్రాన్ ఖాన్ కంటిచూపు కోల్పోయే ప్రమాదం...

- మొదటి పేజి తరువాయి

సుప్రీంకోర్టుకు సమర్పించిన అమికస్ క్యూరీ (కోర్టుకు సహాయకుడు) నివేదిక ఈ షాకింగ్ విషయాలను బయటపెట్టింది. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఇమ్రాన్ ఆరోగ్యం క్షీణించిందని పాకిస్థాన్‌కు చెందిన ప్రముఖ పత్రిక 'ది ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్' తన సంపాదకీయంలో తీవ్రంగా విమర్శించింది.కోర్టు నియమించిన అమికస్ క్యూరీ సల్మాన్ సఫ్దార్, ప్రధాన న్యాయమూర్తి యహ్యా అఫ్రిది నేతృత్వంలోని ధర్మాసనానికి తన నివేదికను సమర్పించారు. గతేడాది అక్టోబర్ 2025 వరకు 6/6గా ఉన్న ఇమ్రాన్ కుడి కంటిచూపు, సరైన వైద్యం అందకపోవడం వల్ల ఇప్పుడు 15 శాతం కంటే తక్కువకు పడిపోయిందని నివేదికలో స్పష్టం చేశారు. కంటి వైద్యుడిని సంప్రదించేందుకు అనుమతించాలని పలుమార్లు కోరినా జైలు సూపరింటెండెంట్ పట్టించుకోలేదని పేర్కొన్నారు.

ఈ నివేదికతో పాకిస్థాన్ ప్రభుత్వం ఇరకాటంలో పడింది. దీనిపై తీవ్రంగా స్పందించిన సుప్రీంకోర్టు, ఇమ్రాన్‌కు వ్యక్తిగత వైద్యులతో చికిత్స అందించాలని, విదేశాల్లో ఉన్న తన కుమారులతో ఫోన్‌లో మాట్లాడేందుకు అనుమతించాలని ఆదేశాలు జారీ చేసింది. ఫిబ్రవరి 16వ తేదీలోగా తమ

ఆదేశాలను అమలు చేసి నివేదిక ఇవ్వాలని స్పష్టం చేసింది. రాజకీయ ఖైదీ పట్ల ప్రభుత్వ తీరును 'క్రిమినల్ నిర్లక్ష్యం'గా అభివర్ణించిన ట్రిబ్యూన్ పత్రిక, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.ఇదిలా ఉండగా, వైద్య కారణాల దృష్ట్యా తోషాఖానా–×× కేసులో తనకు విధించిన శిక్షను నిలిపివేసి, బెయిల్‌పై విడుదల చేయాలని కోరుతూ ఇమ్రాన్ ఖాన్ శనివారం ఇస్లామాబాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కుడి కంటిలో రక్తం గడ్డకట్టడం వల్ల చూపు తీవ్రంగా దెబ్బతిన్నట్లు వైద్యులు నిర్ధారించారని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

## అప్పు ఎంత ఉందో చెప్పలేదు: బడ్జెట్ పై బుగ్గన విమర్శలు

- మొదటి పేజి తరువాయి

విమర్శించారు. అసెంబ్లీలో అబద్ధాలు చెప్పడం పెద్ద నేరమని అన్నారు. ఈ బడ్జెట్ లో కొత్తదనం ఏమీ లేదని... గత బడ్జెట్ బుక్ ను మళ్లీ చదివినట్టే ఉందని చెప్పారు. రాష్ట్ర అప్పు ఎంత ఉందో చెప్పలేదని విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో 9 శాతం వృద్ధి సాధించామని బుగ్గన చెప్పారు. లక్ష 35 వేల మంది యువతకు ఉపాధి కల్పించామని తెలిపారు. మొత్తం 10,032 విలేజ్ క్లినిక్ లను ఏర్పాటు చేశామని చెప్పారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం రూ. 3,700 కోట్లు ఖర్చు పెట్టామని తెలిపారు. 10,775 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు.

## ఫార్ములా ఈ కార్ రేస్‌లో కీలక పరిణామం..

- మొదటి పేజి తరువాయి

ఈ కేసులో రాజకీయ, అధికారులపై ప్రాసిక్యూషన్‌కు అనుమతి రావడంతో ఏసీబీ ఛార్జ్‌షీట్‌కు దాఖలు చేసేందుకు సిద్ధమైంది.

రేసు'లో హెచ్ఎమ్‌డీఏ భాగస్వామి కాకపోయినా, దాని ఖాతా నుంచి రూ.54.88 కోట్లు చెల్లించారు. ఆర్థికపరమైన అనుమతులు లేకుండానే కేటీఆర్ ఇందుకు ఒత్తిడి తెచ్చారని ఏసీబీ నివేదికలో వెల్లడించింది. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా నిబంధనలను తుంగలో తొక్కి విదేశీ కంపెనీలకు ఫండ్స్ మంజూరు చేయడం మరో అభియోగం. నిబంధనలు పాటించకుండా పెద్ద మొత్తంలో నిధులు బదిలీ చేయడంతో హెచ్‌ఎండీఏ ఆదాయ పన్ను శాఖకు రూ.8 కోట్లకు పైగా జరిమానా చెల్లించాల్సి వచ్చింది. ఫార్ములా –ఈ కార్ రేసుకు సంబంధించి మూడేళ్లలో 600 కోట్ల రూపాయలు చెల్లించేలా ఒప్పందాలు జరిగినట్టు దర్యాప్తు సంస్థలు తేల్చాయి.

## బంగ్లాదేశ్ ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యం

- మొదటి పేజి తరువాయి

సార్వత్రిక ఎన్నికల్లో విజ యం సాధించిన అనంతరం ఆయన తొలి ప్రసంగం చేశారు. తమ విజయం బంగ్లాదేశ్ ప్రజలకే చెందుతుందని అన్నారు. ఇప్పుడు మనమంతా స్వేచ్ఛను పొందామని, హక్కులకు అసలైన అర్థాన్ని తిరిగి సంపాదించుకున్నామని ఆయన పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్యం కోసం పోరాడిన వారందరికీ ఈ విజయన్ని అంకితమిస్తున్నామని అన్నారు. బంగ్లాదేశ్ ప్రజల ప్రయోజనాలే దేశ విదేశాంగ విధానాన్ని నిర్ణయిస్తాయని అన్నారు. కాగా, భారత్, చైనా వంటి దేశాలతో సంబంధాలలో సమతుల్యత పాటిస్తామని తారిఖ్ రెహ్మాన్ గతంలో అన్నారు. రెండు దేశాల నిర్ణయాలు, ప్రయోజనాలపై ఆధారపడి భారత్‌తో తమ సంబంధాలు కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు.

## ఏపీ బడ్జెట్‌పై మాజీ ఆర్థిక మంత్రి యనమల ఏమన్నారంటే...!

- మొదటి పేజి తరువాయి

చేసిన కేటాయింపులతో ప్రజా ఆకాంక్షలు నెరవేరతాయని ఆశిస్తున్నాం. ముఖ్యంగా రుణాలను నియంత్రించేలా ఈ బడ్జెట్ ఉంది. రుణాల రీ–షెడ్యూల్, వడ్డీ తగ్గించడం వంటి చర్యల ద్వారా ఆర్థిక శాఖ రాష్ట్రాన్ని అప్పుల నుంచి బయటపడేస్తుందన్న నమ్మకం ఉంది" అని తెలిపారు. పరిశ్రమలు, పెట్టుబడులు, అభివృద్ధికి బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వడం మంచి పరిణామమని యనమల హర్షం వ్యక్తం చేశారు. అదే సమయంలో, సామాజిక న్యాయం దిశగా బడ్జెట్‌ను తీర్చిదిద్దడం అభినందనీయమని ఆయన వ్యాఖ్యానించారు. మొత్తం మీద ఈ బడ్జెట్ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి బాటలు వేస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## దామోదరం సంజీవయ్యకు జగన్ నివాళి

### దామోదరం సంజీవయ్య జయంతి

### దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రి అంటూ జగన్ కితాబు

### పేదల అభ్యున్నతికి జీవితాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తి అని ప్రశంస



దివంగత మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి నేడు. ఈ సందర్భంగా ఆయనకు వైసీపీ అధినేత జగన్ నివాళులు అర్పించారు. ఎక్స్ వేదికగా జగన్ స్పందిస్తూ... అణగారిన వర్గాల ఆశలకు ప్రతీకగా నిలిచిన నాయకుడు, దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య గారు అని కొనియాడారు. పేదల అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి అని కితాబునిచ్చారు. ఆ మహనీయుడి సేవలను స్మరించుకుంటూ ఆయన జయంతి సందర్భంగా నివాళులు అర్పిస్తున్నానని తెలిపారు.

## బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం లో మహా శివరాత్రి వేడుకలు



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 14.**తాడేపల్లిగూడెం బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం లో మహా శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం శ్రీ రమా అక్కయ్య గారి ఆధ్వర్యంలో మహాశివరాత్రి జ్యోతిర్లింగ దర్శనాన్ని ఏర్పాటు చేశారు. 3 రోజులు పాటు జ్యోతిర్లింగ దర్శనాన్ని ప్రజలు హృదయాలలో శివ భక్తిని పెంచే విధంగా కృషి చేస్తున్న బ్రహ్మకుమారి ఈశ్వరయ్య విశ్వవిద్యాలయం వారి కృషిని బిజెపి నరసాపురం పార్లమెంట్ మీడియా కన్వీనర్ సోమేశ్వరరావు వారిని అభినందించారు.




## పంచారామ క్షేత్రాల జాబితా & ప్రత్యేకతలు

1 ద్రాక్షారామం తూర్పు గోదావరి జిల్లా

లింగం పేరు: భీమేశ్వర లింగం

ప్రత్యేకత:

సుమారు 60 అడుగుల ఎత్తు కలిగిన విశాలమైన శివలింగం

లింగం సగం నలుపు సగం తెలుపు రంగుల్లో దర్శనమిస్తుంది

పై అంతస్తు నుంచే అభిషేకాలు, పూజలు జరుగుతాయి

పంచారామాలలో ఇది మొదటి క్షేత్రంగా భావించబడుతుంది

2 సామల్‌కోట కాకినాడ జిల్లా

1 లింగం పేరు: కుమారారామం / కుమార భీమేశ్వర లింగం











# పంచారామ క్షేత్రాలు ఆంధ్రప్రదేశ్ గర్వించదగిన

# ఐదు మహా శైవ పుణ్యక్షేత్రాలు




హిందూ ధర్మంలో శివారాధనకు అత్యంత ప్రాధాన్యత కలిగిన క్షేత్రాలలో పంచారామాలు విశేష స్థానం కలిగి ఉన్నాయి.

తారకాసురుని సంహారానంతరం అతని శరీరంలో నుంచి వెలువడిన శివలింగ భాగాలు ఐదు చోట్ల పతనమయ్యాయని పురాణ కథనం. ఆ ప్రదేశాలే నేడు పంచారామ క్షేత్రాలుగా ప్రసిద్ధి చెందాయి.ఈ ఐదు క్షేత్రాలలో శివుడు ఐదు భిన్న రూపాలలో వెలసి, భక్తులకు అఖండ కృపను ప్రసాదిస్తున్నాడు. ఇవి తెలుగువారికి అత్యంత పవిత్రమైన శైవ క్షేత్రాలు.

ప్రత్యేకత:

ఇక్కడ స్వామికి పాలతో అభిషేకం చేయడం విశేషం

క్షీరసాగర మథనానికి సంబంధించిన దైవకథలు ఈ క్షేత్రానికి అనుసంధానమై ఉన్నాయి

ఆరోగ్యం, శాంతి కోసం భక్తులు విశేషంగా ప్రార్థిస్తారు

5 భీమవరం పశ్చిమ గోదావరి జిల్లా

1 లింగం పేరు: సోమేశ్వర లింగం

ప్రత్యేకత:

చంద్రుడు (సోముడు) తన శాప నివారణ కోసం ఇక్కడ శివుడిని పూజించినట్లు పురాణ గాథ

ఓందుకే స్వామిని సోమేశ్వరుడుగా పిలుస్తారు

మానసిక శాంతి, దుఃఖ నివారణకు ప్రసిద్ధ క్షేత్రం

: పంచారామాల దర్శన ఫలితం :

పంచారామ క్షేత్రాల దర్శనం చేయడం ద్వారా

పాప విమోచనం

శివ కృప

కుటుంబ శాంతి

ఆయురారోగ్య ఐశ్వర్యాలు

ప్రాప్తిస్తాయని శాస్త్ర వచనం.

సేకరణ

డి.వి.ఆర్.జి.వి.రత్నం- స్టాఫ్ రిపోర్టర్

ప్రత్యేకత:

పంచారామాలలో అత్యంత భారీ శివలింగాలలో ఒకటి

స్వామిని కుమార భీమేశ్వరుడు అని పిలుస్తారు

కుమారస్వామి ఆశీస్సులతో ఈ క్షేత్రానికి విశేష మహిమ ఉందని నమ్మకం

3 అమరావతి పల్నాడు జిల్లా

1 లింగం పేరు: అమరేశ్వర లింగం

ప్రత్యేకత:

దీనిని అమరలింగం అని కూడా అంటారు

ఈ లింగం రోజురోజుకూ పెరుగుతుందని భక్తుల విశ్వాసం

దేవతలందరూ ఇక్కడ శివుణ్ణి పూజించారని పురాణ కథనం

4 పాలకొల్లు పశ్చిమ గోదావరి జిల్లా

1 లింగం పేరు: క్షీరారామం / క్షీరేశ్వర లింగం


01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి


## పదవ తరగతి, ఇంటర్ పబ్లిక్ పరీక్షల నిర్వహణకు సమగ్ర ఏర్పాట్లు



కలెక్టర్ కీర్తి చేకూరి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 14:**జిల్లాలో పదవ తరగతి , ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణకు అన్ని విధాలుగా సమగ్ర ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. అమరావతి నుండి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో -- ఇంటర్మీడియట్ పబ్లిక్ ఎగ్జామినేషన్స్, 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు, పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్, ఏజెంట్ స్పేస్ కోసం డాక్యుమెంట్ అప్లోడ్, టీఆర్ , బీ, కోర్టు భవనాల స్థలాల సమస్యలు నూతన జిల్లాల్లో ఏర్పడిన సైట్ సమస్యలపై సమీక్ష నిర్వహించారు.స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి కలెక్టర్ కీర్తి చేకూరి, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, ఇంచార్జి డి.ఆర్.ఓ కె. భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ కోసం మొత్తం 18 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 4,834 మంది విద్యార్థుల్లో అందులో బాలురు 2,759 మంది, బాలికలు 2,075 మంది ఉన్నారని తెలిపారు. ఫిబ్రవరి 23 నుండి మార్చి 24 వరకు ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సర పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు పేర్కొన్నారు.

పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను మార్చి 16 నుండి ఏప్రిల్ 1వ తేదీ వరకు నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా 138 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 400 పాఠశాలలకు చెందిన మొత్తం 24,080 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతుండగా, అందులో బాలురు 12,288 మంది, బాలికలు 11,792 మంది ఉన్నారని వివరించారు.

పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు, శుచిత, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీస్, విద్యాశాఖ, రెవెన్యూ శాఖలతో సమన్వయం కల్పిస్తున్నట్లు వెల్లడించారు.ఏపీ ఓపెన్ స్కూల్ పరీక్షలకు సంబంధించి 2,587 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు, అందులో 1,471 మంది బాలురు ఉన్నారని తెలిపారు. పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ నేపథ్యంలో ఉపాధ్యాయుల హాజరు, బోధన విధానం, బోధన పద్ధతులు, విద్యార్థుల సంతృప్తి స్థాయి, పాఠశాల భవనాల పరిస్థితి వంటి అంశాలపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సమీక్షించినట్లు తెలిపారు. అవాంఛనీయ ఘటనలు లేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు.

# శ్రీ రామ పాదుకలకు శిరస్సు వంచి నమస్కరించిన తాడేపల్లిగూడెం భక్తులు.





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, ఫిబ్రవరి 14.** అయోధ్య నుండి తాడేపల్లిగూడెం వచ్చిన శ్రీరాముడి విగ్రహం, పాదుకలు, విల్లు లను గ్రామంలో శనివారం ఘనంగా ఊరేగించారు. అయోధ్యకు చెందిన చల్ల శ్రీనివాస శాస్త్రి అని శ్రీరామ భక్తుడు వీటిని తయారు చేయించారు. శ్రీరాముని ఆరడుగులు పొడవైన విల్లు 14 కేజీ లు బరువు ఉండగా పాదుకలు మూడు కేజీలు బరువు ఉంటుందని శ్రీనివాస శాస్త్రి తెలిపారు. వీటిని బంగారం తదితర లోహాలతో తయారు చేయించామన్నారు. పాదుకులను రామేశ్వరం నుండి సుమారు ఎనిమిది వేల కిలోమీటర్లు అయోధ్యకు కాలినడకన తీసుకు వెళ్లాను అన్నారు. అలా పాదయాత్ర చేయడానికి 7 నెలల 16 రోజుల సమయం పట్టిందని తెలిపారు. వాటిని మళ్లీ అయోధ్య నుండి రామేశ్వరం తీసుకురావడం జరిగిందని అక్కడనుండి మళ్లీ అయోధ్య తీసుకువెళ్తున్నామన్నారు. మధ్యలో ఉన్న అన్ని గ్రామాలులో స్వామి వారికి పూజ, అభిషేకాలు చేసి గ్రామంలో ఊరేగించి అనంతరం వేరొక గ్రామం తీసుకువెళ్లను న్నామన్నారు. శనివారం తాడేపల్లిగూడెం వచ్చిన శ్రీరాముని విగ్రహం, పాదుకలు, విల్లులను సత్యవతి నగర్ లో ఉన్న కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో కాళ్ల అరుణ కుమారి గోపికృష్ణ దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మేళ, తాళాలు, మంగళ వాయిద్యాలు నడుమ ముత్తైదువులు కళశాల తో స్వామివారిని దగ్గర్లో కుంచనపల్లి లో కొలువై ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి తీసుకువెళ్లారు. అక్కడ ప్రత్యేక పూజలు కార్యక్రమాలు నిర్వహించి భక్తుల దర్శనార్థమై కొద్దిసేపు ఉంచారు. అనంతరం అక్కడనుండి తాడేపల్లిగూడెంలో ఉన్న రామాలయం వద్దకు విగ్రహం తీసుకొచ్చారు. అక్కడ భక్తుల దర్శనానంతరం ప్రయాణాన్ని ముందుకు సాగించారు. ఈ రామ పాదుకల ఊరేగింపు విషయమై చల్ల శ్రీనివాస శాస్త్రి మాట్లాడుతూ తాను శ్రీరాముని పరమ భక్తుడని అన్నారు. అయోధ్యలో 500 కోట్ల రూపాయలతో శ్రీ కళ్యాణ రాముడు ఆలయాన్ని ఐదు ఎకరాల సుదీర్ఘప్రాంగణంలో నిర్మిస్తున్నాను అన్నారు. తాను తయారు చేయించిన శ్రీరాముడు, పాదుకలు, విల్లులను ఆ ఆలయంలో ప్రతిష్ఠించనున్నారు. రామేశ్వరం నుండి వీటిని అయోధ్యకు తీసుకువెళ్లే కార్యక్రమంలో భాగంగా మధ్యలో 52 పీఠాలకు చెందిన మఠాధిపతుల పూజలను శ్రీరాములు వారు అందుకున్నారన్నారు. అక్కడ శ్రీరాముడి విగ్రహం 108 అడుగులు ఉండగా, హనుమంతుని విగ్రహం 54 అడుగులతో తయారు చేయించడం జరిగిందన్నారు. సరయు నది తీరాన ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు శ్రీనివాసు శాస్త్రి తెలిపారు. భక్తుల పాలిట కొంగు బంగారం గా నిలిచే ఈ శ్రీ కళ్యాణ రామ ఆలయం ఎంతో పవిత్రమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో చెరుకూరి పద్మ వెంకట కృష్ణంరాజు, గోనబోయిన రామ్మోహన్ రావు,పేరిచర్ల మురళీకృష్ణ రాజు, నడింపల్లి బంగార్రాజు, శ్రీదేవి విష్ణు రావు, బొర్రా రమాదేవి మురళి దంపతులు మహిళ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జనం మెచ్చేదే జనసేన -ఇంచార్జ్ సువర్ణరాజు.





**గోపాలపురం, పెన్ పవర్, ఫిబ్రవరి 14.** జనం మెచ్చేది జనంలో నుంచి పుట్టుకు వచ్చింది జనసేన పార్టీ అని గోపాలపురం నియోజకవర్గ ఇన్చార్జ్ దొడ్డిగర్ల సువర్ణరాజు అన్నారు. మండలంలోని కరగపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన జనసేన పార్టీ స్థూపాన్ని ఇంచార్జ్ సువర్ణరాజు, పార్టీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి లు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక సామాన్య కుటుంబం నుండి వచ్చిన పవన్ కళ్యాణ్ పార్టీని స్థాపించి రాష్ట్రాన్ని శాసించే స్థాయికి ఎదిగారని కొనియాడారు. రాబోయే తరం జనసేన పార్టీ దేనన్నారు. తమ పార్టీ అధినేత రాష్ట్ర మంత్రి పవన్ కళ్యాణ్ అధికారంలోకి వచ్చిన తర్వాత దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి కృషి చేయడం అభినందనీయం. కూటమి పాలనలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, అమరావతి ఏర్పాటు వంటివి అభివృద్ధికి సూచకం అన్నారు. మారుమూల గిరిజన గ్రామాల్లో దశాబ్దాల తరబడి అభివృద్ధికి నోచుకోని గ్రామాలకు కాలినడకన వెళ్లి వారి సమస్యలను తెలుసుకొని తక్షణం పరిష్కరించిన ప్రజా నాయకుడు అన్నారు. ప్రభుత్వాలు మారిన కనీస సౌకర్యాలకు నోచుకోని గిరిజన గ్రామాలకు రహదారులు నిర్మించిన మహోన్నతమైన వ్యక్తి అన్నారు. అటువంటి నాయకుని సారథ్యంలో జనసేన పార్టీ రాష్ట్రంలో దినదినాభివృద్ధి చెందుతుంది అన్నారు. దానికి నిదర్శనం మారుమూల ల కరగపాడు గ్రామంలో జనసేన పార్టీ స్థూపాన్ని ఏర్పాటు చేయడమే అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన ఐక్యంగా ఉండి అభ్యర్థుల విజయానికి కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నల్లజర్ల జనసేన పార్టీఅధ్యక్షులు చోడసాని బాపిరాజు, జిల్లా పార్టీ ప్రోగ్రామింగ్ కమిటీ కార్యదర్శి కౌలూరి సత్తిబాబు, గోపాలపురం జనసేనమండల పార్టీ ఉపాధ్యక్షులు పోసిన గణపతి, గ్రామ కమిటీ అధ్యక్షులు కుచ్చుశివ, జక్కుల బాలు, ప్రధాన కార్యదర్శి నరేష్, మండల కార్యదర్శి పళ్ళ అయ్యప్ప నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన జనసేన పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మహాశివరాత్రి ఉత్సవాలకు ఐటిడిఏ కంట్రోల్ రూమ్ ఏర్పాటు



జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్

**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్,ఫిబ్రవరి 14:**రంప గ్రామంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి ఆలయంలో ఈనెల 15వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ఐదు రోజులపాటు జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణకు ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు రంపచోడవరం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి, పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ తెలిపారు.శుక్రవారం ఆయన మాట్లాడుతూ, ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు.రంపచోడవరం ఐటిడిఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ద్వారా రంప, గురమంద, పూతిగుంట, జడ్డంగి, దేవీపట్నం ప్రాంతాలకు సంబంధించిన ఉత్సవాల సమాచారాన్ని పొందవచ్చని పేర్కొన్నారు.

కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహించనున్న అధికారుల వివరాలు ఇలా ఉన్నాయి:

డిప్యూటీ తహసీల్దార్ పాయాజ్ భాష (9491242143), ఎస్.కె. యూనస్ భాష (6271974387), ఎస్.కె. హిమఖాదర్ (7309212288), బి.వి.వి. నాగభూషణం (9441475034), జె.వి.వి. సత్యనారాయణ (9490000029), కే. అప్పలరాజు (7382538998), సి.హెచ్. నీరజ కుమారి (8247068003), పండు దొర (9441058467), శివ నాగు (8500800833).

ఉత్సవాల సందర్భంగా ఏవైనా సమస్యలు తలెత్తిన పక్షంలో పై సెల్ నంబర్లకు సంప్రదించి సహాయం పొందవచ్చని జాయింట్ కలెక్టర్ సూచించారు.

## పవిత్ర గోదావరి తీరం వద్ద ప్రాచీన శివాలయం



-ముస్తాబైన రుద్ర కోటేశ్వర స్వామి వారి ఆలయం

**వి.ఆర్.పురం పెన్.పవర్.పిబ్రవరి.14:**కాకతీయ కాలం నాటి నాటి శైవ క్షేత్రం పోలవరం జిల్లా రంపచోడవరం డివిజన్ వరరామచంద్రపురం మండలం వడ్డిగూడెం గ్రామంలో కొలువై యున్న శ్రీ సతీపార్వతి రుద్రకోటేశ్వస్వామి శివాలయం సర్వాంగ సుందరంగా ముస్తాబు అయింది.ప్రతాపరుద్రులు కాకతీయుల కాలం నాటి ఈ ఆలయానికి ఎంతో ప్రాధాన్యత ఉన్నది.ప్రతి సంవత్సరం ఇక్కడ వైభవంగా శివపార్వతుల కళ్యాణాన్ని అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. నేడు ఆలయంలో రుద్ర కోటేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు అలంకరణ అనంతరం రాత్రి 10 గంటల ఐదు నిమిషాలకు కల్యాణ మండపంలో స్వామివారి అమ్మవార్లతో వివాహ మహో త్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు.రుద్రకో టేశ్వర స్వామి ఆలయ చైర్మెన్ బొర్రా ఆదినారాయణ ఆలయకమిటీ సభ్యులు,ఆధ్వర్యంలో దేవాలయంకు సంబందించిన పనులు ఏర్పాట్లు చక చక సాగుతున్నా యి.ఎండో మెంట్ అధికారి జూనియర్ అసిస్టెంట్,పర్య వేక్షణలో ఆలయ ప్రాకారాలు పరిసర ప్రాంతాలలో చలువ పందిర్లు పనులు పూర్తి అయ్యాయి.ఆలయానికి రంగులు అద్దారు.విద్యుత్ దీపాలతో అలంకరించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు.ఐదు రోజుల పాటు వివిధ అత్యంత వైభవంగా వివిధ రూపాలలో స్వామివారికి ప్రత్యేక పూజ లు ఉత్సవాలునిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు సత్యనారాయణ శర్మ తెలిపారు.పవిత్ర గోదావరి,శబరి నదుల సంగమ ప్రాంతంలో అతి ప్రాచీన పవిత్రమైన శైవ క్షేత్రం ఇది ఇక్కడప్రతి సంవత్సరం మహా శివరాత్రి ఉత్స వాలు కన్నుల పండుగగా జరిపిస్తారు.మండల నలుమూ లలనుండి భక్తులుఈ ఆలయాన్ని దర్శించుకునేందుకు స్వామివారి కల్యాణాన్నివీక్షించేందుకు ప్రజలు తరలివస్తు న్న నేపథ్యంలో సంబంధిత అధికారులు ఆలయ కమిటీ వారు ఏర్పాట్లు లను పూర్తిచేసి ఆలయాన్ని సర్వంగా సుం దరంగా ముస్తాబు చేశారు.శ్రీ సతీపార్వతి రుద్రకోటేశ్వ స్వామి ఆలయంలో జరుగబోవు మహా శివరాత్రి పండు గను తిలకించేందుకు భక్తులు అతిపెద్ద సంఖ్యలో రావడం జరుగుతుంది.మండలప్రజలకు అసౌకర్యంగా కలగకుండా అన్ని ఏర్పాట్లుచేశారు.

## ఆధ్యాత్మికజ్ఞానానికి ప్రతీక మహా శివరాత్రి.

శాప్ డైరెక్టర్ జగదీశ్వరి.



**పోలవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 14.** అజ్ఞానం అనే అంధకారాన్ని తొలగించి ఆధ్యాత్మిక జ్ఞాన దీపాన్ని వెలిగించేదే మహాశివరాత్రి అని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ నిర్వాహకురాలు జగదీశ్వరి అన్నారు. శనివారం ఆమె ముందుగానే రాష్ట్ర ప్రజానీకానికి మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినం హిందువులకు ఎంతో శ్రేష్టమైందన్నారు. ప్రతి ఒక్కరు నిర్మలమైన భక్తితో స్వామివారి ని సేవించడం ఆనవాయితీ అన్నారు. జగతికి అమ్మ అయిన పార్వతి సమేతంగా శివుని ధ్యానిస్తే సర్వపాపాలు తొలగి పోతాయి అన్నారు. శివనామ స్మరణం సర్వ పాప హరణం కాబట్టి శివరాత్రి రోజు ప్రతి ఒక్కరు శివ నామాన్ని పటిస్తూ ఉండాలని కోరారు. ఆ దేవదేవుడైన శివయ్యఆశీస్సులు రాష్ట్ర ప్రజానీకానికి పుష్కలంగా ఉండాలని ప్రజలంతా సుఖ శాంతులు, ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని జగదీశ్వరి కోరారు.

## బొమ్మూరు గ్రామ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుల సమావేశం




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 14:**రాజమండ్రి రూరల్ నియోజకవర్గం బోమ్మూరు గ్రామ నాయకుల సమావేశం రాష్ట్ర కార్యదర్శి గొందేశీ శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథులుగా వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షులు చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ హాజరయ్యి మాట్లాడుతూ, పార్టీ కార్యకర్తల సంక్షేమం కోసం పార్టీ అధ్యక్షుల వై.యస్ జగన్మోహన్ రెడ్డి ప్రమాధ భీమ కింద కార్యకర్తలకు నష్టం జరిగితే వారి కుటుంబశీ రోడ్డున పడకుండా పార్టీ తరపున రూ.5 లక్షల రూపాయల ప్రమాద భీమా ఇన్సూరెన్స్ పాలసిని ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ప్రతి కార్యకర్త కుటుంబానికి అండగా పార్టీ ఉంటుందని భరోసా కల్పించడం చాలా ఆనందంగా ఉందన్నారు, ప్రతి కార్యకర్తకు అండగా ఉండే విధంగా నాయకుడు అడుగులు వేస్తున్నారని,పార్టీ కోసం ఎన్నో త్యాగాలు చేసి అంకితభావంతో పనిచేసిన ప్రతి కార్యకర్తకు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంటామని హామీ ఇస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏనుముల త్యాగరాజు,దాకే శ్రీను,ముద్దాల అను,సద్గుణ రామా రెడ్డి,కంభం సుబ్బారెడ్డి,తోడేటీ రాజా,బిల్డర్ రాజా, మారడాపు శేఖర్,రాయుడు ప్రసాద్,పరిమళ నాని,తోడేటీ రాహుల్,వై.యస్ కుమార్,షేక్ సమీరా,పరిమళ రాజీవ్ కుమార్,సోమన శ్రీను,జిమ్మీ,యాళ్ల కృష్ణంరాజు,రమేష్ యాదవ్,చేర్లి వెంకటరావు,కోటిపల్లి రవి,గులిమి నాగేశ్వరరావు,సూరంపూడి ప్రకాష్, శేఖర్, నాయుడు,కాకులపాటి కుమార్,పిట్టాకన్నా,చరణ్,మురళి,గోపి,గిరి తదితరులు పాల్గొన్నారు.

## మార్చిలో జిల్లాలో పిసిసి అధ్యక్షురాలు షర్మిల రెడ్డి ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర

కాంగ్రెస్ పార్టీ రాజమండ్రి పార్లమెంట్ కో - ఆర్డినేటర్ టీ.కే విశ్వేశ్వర రెడ్డి, నగర అధ్యక్షులు బాలేపల్లి మురళీధర్ పిలుపు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్ ఫిబ్రవరి 14:** మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును మార్చడాన్నీ నిరసిస్తూ పైపిసిసి అధ్యక్షురాలు షర్మిల రెడ్డి జిల్లాలో చేసే ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర ను విజయవంతం చెయ్యాలని కాంగ్రెస్ పార్టీరాజమండ్రి పార్లమెంట్ కో - ఆర్డినే టర్ టీ.కే విశ్వేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాజమండ్రి నగర అధ్యక్షులు బాలేపల్లి మురళిధర్ పేర్కొన్నారు. నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలేపల్లి మురళిధర్ అధ్యక్షతన స్థానిక పేపర్ మిల్ ఎదురుగా ఉన్న శ్రీకృష్ణ సాయి కళ్యాణ మండపంలో కాంగ్రెస్ పార్టీ తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుల విస్తృతస్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా టీకే విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్చి

జీ రాంజీ పేరు పెట్టడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి చేస్తున్న కుటిల రాజకీయాలను ప్రజల్లో ఎండగట్టాలని కాంగ్రెస్ శ్రేణులకు సూచించారు .పీసీసీ అధ్యక్షురాలు చేపట్టిన యాత్ర గ్రామీణ ప్రాంతాలైన దుద్దుకూరు, కడియపు లంక గ్రామాల్లో బహిరంగ సభ లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు . మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం గతంలో 90 శాతం నిధులు కేంద్రం భరిస్తే, 10 శాతం నిధులు రాష్ట్రాలు భరించే వన్నారు. అయితే ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వాలు 40 శాతం, కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులు భరించాల్సి రావడం రాష్ట్రాలకు పెను భారంగా మారుతుందన్నారు. ఉపాధి హామీ పథకం సవరించి అమలు చేయడం వలన రాష్ట్రాలకు కలిగే నష్టాలను వివరిస్తూ మార్చి నెలలో తూర్పుగోదావరి జిల్లాలో పిసిసి అధ్యక్షురాలు షర్మిల రెడ్డి చేపట్టిన ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర ఉంటుందన్నారు. ఈ యాత్రను విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా తూర్పుగోదావరి జిల్లాకు ప్రత్యేక గుర్తింపు ఉందని ఈ నేపథ్యంలో జిల్లాలో పిసిసి అధ్యక్షురాలు పర్యటన ప్రతిష్టాత్మకంగా తీసుకొని కార్యకర్తలు విజయవంతం చేసేందుకు కృషి చేయాలని పిలుపు ఇచ్చారు. పార్టీ నగర అధ్యక్షులు బాలేపల్లి మురళిధర్ మాట్లాడుతూ దేశ ప్రధానిగా రాహుల్ గాంధీని రాష్ట్ర ముఖ్యమంత్రిగా షర్మిలారెడ్డిని గెలిపించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ముందుకు సాగుతున్నామన్నారు. పిసిసి అధ్యక్షులు షర్మిల రెడ్డి యాత్ర విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మోతా శారద, డాక్టర్ వడియార్, డాక్టర్ రాజశేఖర్, ఎండి షరీఫ్, కాటం రవి, వివిధ నియోజవర్గాల కోఆర్డినేటర్లు, మండల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హజరత్ వలి జల్ జలిష బాబా ఉరుసు మహోత్సవం



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 14:** స్థానిక గీతా అప్సర థియేటర్ ప్రక్కన హజరత్ వలి జల్ జలిష బాబా వారి ఉరుసు మహోత్సవం ట్రస్టు బోర్డు అధ్యక్షులు మహమ్మద్ అబ్దుల్ జలీల్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. హఫీజ్ సయ్యద్ అన్సారీ దర్గా నందు ఆధ్యాత్మిక కార్యక్రమం జరిపి ప్రార్ధనలు చేసారు. ఈ కార్యక్రమంలో దర్గా పూర్వ అధ్యక్షులు షేక్ అసదుల్లా అహ్మద్,రాయల్ మసీదు అధ్యక్షులు షేక్ అబ్దుల్ కరీం, బాసిత్ ఖాన్ నజీర్, కాలేషా, వలి బాబా, బెగ్, ఆరిఫ్ మహబూబ్ ఆలం గాలిబ్ ఇమ్రాన్, కూడదు భాష, షహీద్, అమీర్ ,జిలానీ మూస,, బాబు , మునీర్, తదితరులు పాల్గొన్నారు

# మహా సుదర్శన హోమంలో పాల్గొన్న జి ఆర్ కె



**జిలుగుమిల్లి, పెన్ పవర్, ఫిబ్రవరి 14 ;** సహస్ర కలిసా సుదర్శన హోమం లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి గడ్డ మణుగు రవికుమార్ పాల్గొన్నారు. శనివారం ఐఎస్ జగన్నాధపురం గ్రామంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో హోమం రంగ రంగ వైభవంగా జరిగింది. కొచ్చర్లకోట నరసింహం గురూజీ ఆధ్వర్యంలో మహాశివరాత్రి ని పురస్కరించుకొని యోగశాల ప్రవేశం నిర్వహిస్తారు .ఈ కార్యక్రమానికి రాజకీయ ప్రముఖులు, భక్తులు పాల్గొంటారని తెలిపారు. శివుని అనుగ్రహం పొంది అందరికీ ఆశీస్సులు ఉండాలని కోరుకున్నారు.

# వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టతకు కృషి చేయాలి. శ్రీరామమూర్తి.



**గోపాలపురం, పెన్ పవర్, ఫిబ్రవరి 14.**
వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు నాయకులు కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షులు వెలగా శ్రీరామమూర్తి అన్నారు. మండలంలోని సంజీవపురం గ్రామపంచాయతీ పరిధిలోని రేగులకుంట గ్రామంలో శనివారం పార్టీ ముఖ్య నేతలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామ సర్పంచ్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఇళ్ల శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో అధ్యక్షులు శ్రీరామమూర్తి మాట్లాడారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకు వెళ్లడంతో పాటు ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నాయకులు ప్రజలకి అందుబాటులో ఉంటూ చేదోడు వాదోడుగా ఉండాలన్నారు. అలాగే ప్రజా సమస్యల పట్ల స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కమిటీ నాయకులు పఠాన్ అన్సర్ భాష, మాజీ సర్పంచ్ బ్రహ్మానందం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# పుల్వామా వీర జవాన్లకు ఘన నివాళి

✷ విక్టోరియా మాంటిస్సోరి హై స్కూల్



**కూనవరం,పెన్ పవర్,ఫిబ్రవరి 14.** పుల్వామా దాడిని ఖండిస్తూ విక్టోరియా మాంటిసోరి హై స్కూల్ ప్రిన్సిపాల్ విక్కీ సింగ్,వైస్ ప్రిన్సిపల్ రూబీ సింగ్ ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులు,ఉపాధ్యాయులు కొవ్వొత్తులను చేతబట్టి టేకుల బోరు నుండి కూనవరం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ విక్కీ సింగ్ మాట్లాడుతూ దేశం కోసం,దేశ సరిహద్దుల వద్ద శత్రు దేశ సైనికులను దేశ సరిహద్దులలో కాలు మోపకుండా నిరంతరం పహారా కాస్తూ దేశ సేవకు అంకితమైన మన వీర జవానులను 2019 ఫిబ్రవరి14న పాకిస్తాన్ ఉగ్ర మూకలు దొంగ దెబ్బ తీయడంతో పుల్వామా దాడిలో 40 మంది దేశం కోసం వీరమరణం పొందారని, ఫిబ్రవరి14 బ్లాక్ డేగా జరుపుకుంటున్నామని అన్నారు. విద్యార్థిని,విద్యార్థులకు దేశం కోసం అని నిత్యం శ్రమిస్తున్న వీర జవాన్ల యొక్క సాహసాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ లో తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి వేడుక

**ఇంచార్జి డి ఆర్వో ఎస్ భాస్కర్ రెడ్డి**



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 14:** మహనీయుల త్యాగాలు, సేవలను భావితరాలకు చేరవేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం మహనీయుల జయంతి వేడుకలను అధికారికంగా రాష్ట్ర వేడుకలుగా నిర్వహిస్తోందని ఇంచార్జి జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ భాస్కర్ రెడ్డి అన్నారు.

కలెక్టరేట్‌లో దామోదరం సంజీవయ్య 105వ జయంతి వేడుకలు సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులు అర్పించారు. అనంతరం బొమ్మూరు గిరిజన సంక్షేమ, సాంఘిక సంక్షేమ వసతి గృహాల విద్యార్థినులు దేశభక్తి గీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా ఇంచార్జి జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ, సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజాసేవ వంటి విలువలను సమాజంలో నెలకొల్పిన మహనీయుల జీవితం యువతకు దిశానిర్దేశం చేయాలన్నారు . భారత రాజకీయ చరిత్రలో విశిష్ట స్థానాన్ని సంపాదించిన మహానుభావుడు దామోదరం సంజీవయ్య ఘుని స్మరించుకోవడం గర్వకారణమన్నారు. 1921 ఫిబ్రవరి 14న కర్నూలు జిల్లాలో సాధారణ కుటుంబంలో జన్మించిన ఆయన, తన ప్రతిభా, పట్టుదలతో ఉన్నత స్థానాలను అధిరోహించా రన్నారు. 1960లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి, దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రిగా చరిత్ర సృష్టించిన గొప్ప నాయకుడని కొనియాడారు. సామాజిక సమానత్వం, అణగారిన వర్గాల అభ్యున్నతి, విద్యా అవకాశాల విస్తరణ కు ప్రాధాన్యతనిస్తూ పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన దూరదృష్టి నాయకుడని పేర్కొన్నారు.

ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో మంత్రిగా సేవలందించి ప్రజాహితాన్ని కాంక్షించిన ఆదర్శనీయ రాజకీయ నాయకుడని అన్నారు. విశాఖపట్నంలోని లా కాలేజీకి, హైదరాబాద్‌లోని సంజీవయ్య పార్కుకు ఆయన పేరు పెట్టారని, ఆయన జీవిత విశేషాలు ప్రజలకు తెలియాలన్నారు.

ఈ సందర్భంగా హాజరైన వక్తలు మాట్లాడుతూ, దామోదరం సంజీవయ్య కేవలం రాజకీయ నాయకుడు మాత్రమే కాకుండా సామాజిక న్యాయం కోసం అహర్నిశలు కృషి చేసిన మహోన్నత వ్యక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఎండి ఘయాజుద్దీన్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కె.ఎన్. జ్యోతి, ఏఎస్వో ఎస్. సత్యనారాయణ, స్థానిక నాయకులు జార్జి అందోని, ఠాగూర్, గిరిజన సంక్షేమ వసతి గృహ ఉపాధ్యాయులు, విద్యార్థులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# నిబంధనల ఉల్లంఘనపై రెండు ఇసుక లారీలు సీజ్



**జిల్లా మైన్స్ అధికారి డి ఫణి భూషణ్ రెడ్డి**

**సీతానగరం, పెన్ పవర్, ఫిబ్రవరి 14:** తూర్పు గోదావరి జిల్లాలో ఇసుక త్రవ్వకాలు, రవాణాపై నిబంధనల అమలు పర్యవేక్షణలో భాగంగా గనులు భూగర్భ శాఖ అధికారులు అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరిగిందని జిల్లా మైన్స్ అండ్ జియాలజి అధికారి డి ఫణి భూషణ్ రెడ్డి శనివారం ఒక ప్రకటన లో తెలియ చేశారు. ఫిబ్రవరి 13 శనివారం అర్ధరాత్రి సమయంలో సీతానగరం మండలం ములకల్లంక గ్రామ పరిధిలో జిల్లా గనులు భూగర్భ శాఖ అధికారి డి. ఫణి భూషణ్ రెడ్డి సిబ్బందితో కలిసి తనిఖీ చేపట్టడం జరిగిందన్నారు. తనిఖీ సందర్భంగా గారపాటి వీరబ్రహ్మం తదితరులకు చెందిన 4.71 హెక్టార్ల పట్టాభూముల్లో అనుమతులున్న రీచ్‌లో ఇసుక తరలిస్తున్న రెండు వాహనాలను గుర్తించామన్నారు. పర్యావరణ అనుమతులు, ఎన్.జి.టి. ఆదేశాల ప్రకారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ఇసుక త్రవ్వకాలు జరపాల్సి ఉండగా, రాత్రి 10 గంటల సమయంలో ఇసుకను లారీలలో లోడ్ చేసి డిస్పాచ్ పర్మిట్ జారీ చేసినట్లు తనిఖీ లో వెల్లడైందన్నారు. అందులో భాగంగా ఏపా39జెూ9159 మరియు ఏపా39జెూ9159 వాహనాలను సీజ్ చేశామన్నారు. అధిక లోడుతో రవాణా చేసినందుకు సంబంధిత వాహనాలపై చర్యలు తీసుకోవాలని జిల్లా రవాణా అధికారికి సిఫార్సు చేసినట్లు తెలియ చేశారు. అదేవిధం గా సంబంధిత పట్టాభూముల రీచ్‌కు కేటాయించిన శాండ్ సప్లై పాయింట్ ఐడీని బ్లాక్ చేశారు. పట్టాభూముల యజమానులకు నోటీసులు జారీ చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో సర్వేయర్ పట్నాల శ్రీనివాస్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# ఏజెన్సీ గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి.






**సంఘ నాయకులు రాంబాబు.**

**గోపాలపురం, పెన్ పవర్, ఫిబ్రవరి 14.** గిరిజనుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా నాయకులు జిల్లా నాయకులు సవలం రాంబాబు, కార్యదర్శి కుంజం రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఉండే గిరిజన సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17, 18 తేదీలలో జిల్లాస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు వీరు తెలిపారు. పోలవరం మండలం మణుగోపాలలో పార్వతీ స్తూపం వద్ద ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి శనివారం దొండపూడి ప్రధాన రహదారి వెంబడి ఎర్రజెండాలు చేత పట్టి ర్యాలీ నిర్వహించారు. ప్రజా కళాకారులు కోలాటం, రేలా,కింజిరి వంటి నృత్య ప్రదర్శనలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు రాంబాబు, రామారావు లు మాట్లాడుతూ గిరిజనులు జన్మతః కొండలు అడవుల్లో జీవనం సాగిస్తూ ఉంటారన్నారు. తరతరాలుగా అడవుల్లోని పోడు భూములను ఆధారంగా చేసుకుని బ్రతుకుతున్నారన్నారు. ఇటీవల ప్రభుత్వాలు గిరిజనుల జీవితాలను నాశనం చేసే విధంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాల తరబడి సాగు చేసుకుంటున్నా భూములకు పట్టాలు ఇవ్వడం లేదని వాపోయారు. అలాగే గిరిజన భూములకు సంబంధించిన చట్టాన్ని కాలరాసే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. అడవులను నమ్ముకుని బ్రతికే గిరిజనులను బయటకు పంపే ప్రయత్నాలు ప్రభుత్వాలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిర్వహిస్తున్న సమావేశానికి మాజీ మంత్రి సంయుక్త కిసాన్ మోర్చా కన్వీనర్ వడ్డే శోభనాద్రిశ్వరరావు, రైతు కూలి సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ, రామిరెడ్డి, వర్మ వంటి ప్రముఖ సంఘ నాయకులు హాజరవుతున్నారు అన్నారు. గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ఈ సమావేశానికి గిరిజనులతో పాటు పేద బడుగు బలహీన వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని వారు కోరారు.

# భగవాన్ శ్రీ సత్యసాయి బాబా స్వామి వారి శత వర్ష జన్మదినోత్సవాలు.





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 14.** భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి దివ్య అనుగ్రహ ఆశీస్సులతో స్వామి వారి శత వర్ష జన్మదినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి విద్యాలయం బాల బాలికలచే వేద పఠనం మరియు సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్న బాల బాలికలకు ప్రశంసా పత్రాలు అందచేయటం జరిగింది. ఫిబ్రవరి 14 పుల్వామా దాడి లో అమరులైన వీర జవాన్లకు అంజలి ఘటించి ప్ల కార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి విద్యాలయం చైర్మన్ ఎస్. విష్ణుమూర్తి, సెక్రటరీ కరెస్పాండెంట్ ప్రవా శ్రీనివాస్ కమిటీ సభ్యులు ఆకుల సవీన్ బాబా,తోట రాధికా రాణి, ప్రిన్సిపాల్ సిహెచ్.లవ కుమారి, తులసి ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొనిరి…సాయిరాం

# వెంకట్రామన్నగూడెం డా. వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం లో మాజీ ముఖ్యమంత్రి దివంగత దామోదరం సంజీవయ్య 105 వ జయంతి



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 14.** మాజీ ముఖ్యమంత్రి దివంగత శ్రీ దామోదరం సంజీవయ్య 105 వ జయంతి సందర్భంగా, వెంకట్రామన్నగూడెం డా. వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిపాలనా భవనం లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఉపకులపతి డా. కె. ధనుంజయరావు పాల్గొన్ని సంజీవయ్య గారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ, "ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెండవ ముఖ్యమంత్రి, తొలి దళిత ముఖ్యమంత్రి గాను , రెండుసార్లు అఖిల భారత కాంగ్రేస్ కమిటీ (ఏఐసిసి) అధ్యక్షుడు గాను పనిచేసిన యువనాయకుడు శ్రీ సంజీవయ్య ఆయన జీవితం నీతి నిజాయితీ లకు నిలువుటద్దం" అని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా. ఎం. మాధవి, భోదేనతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వేదఘోషల మధ్య రంప శివాలయానికి పంచలోహ విగ్రహాల ఊరేగింపు

**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్ ఫిబ్రవరి 14:**రేపు జరగబోయే మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా పంచలోహ విగ్రహాలను స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలోని రామాలయం నుంచి రంప శివాలయానికి ఘనంగా ఊరేగింపుగా తరలించారు.వేదమంత్రాల నడుమ, డప్పు వాయిద్యాలు, భక్తి గేయాలతో పల్లకిపై భుజాలపై మోసుకుంటూ కాలినడకన విగ్రహాలను తీసుకెళ్లడం విశేషంగా నిలిచింది.ఈ సందర్భంగా రంపచోడవరం తహసీల్దార్ పి. బాలాజీ మాట్లాడుతూ, ఈనెల 15వ తేదీ ఆదివారం ప్రారంభమయ్యే మహాశివరాత్రి ఉత్సవాలు 19వ తేదీ వరకు భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి భక్తుడు శివాలయాన్ని దర్శించుకుని పరమశివుని ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు.మాజీ శాసనసభ్యులు సీతంశెట్టి వెంకటేశ్వరరావు, ఎంపీడీవో ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో హరిబాబు, సర్కిల్ ఇన్స్పెక్టర్ పి.ఎస్. నాయుడు, సబ్ ఇన్స్పెక్టర్ వెంకట్రావు, పురోహితులు ప్రసన్నకుమార్, హిందూ పరిషత్ సభ్యులు, శివాలయ కమిటీ సభ్యులు, భక్తులు భారీ సంఖ్యలో ఈ ఊరేగింపులో పాల్గొన్నారు.అదేవిధంగా, పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ ఆధ్వర్యంలో మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించబడుతున్నాయని అధికారులు తెలిపారు.



విగ్రహాల ఊరేగింపులో సీతంశెట్టి రత్తిరెడ్డి, నల్లమిల్లి రామారెడ్డి, గుడ్ల శ్రీనివాసరావు, సర్పంచ్ చెదల శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి కామరాజు, ఆర్ఐ సిహెచ్ నిర్మలకుమారి, వీఆర్వో చిన్నరాజు తదితరులు పాల్గొన్నారు.

# భారీ వాహనాల వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు..





- గంటల తరబడి నిలిచిపోతున్న వాహనాలు!
- శని ఆదివారాల్లో భారీ మట్టి లారీలు..
- రోడ్డుకి ఇరువైపులా వాహనాలు..

**కోరుకొండ,పెన్ పవర్, ఫిబ్రవరి 14:** భారీ వాహనాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి మూల కారణం నిత్యం రాత్రి పగలు తేడా లేకుండా మట్టి లారీలు తిరగడమే దీనికి కారణం ప్రజలు ప్రయాణికులకు ట్రాఫిక్ ఇబ్బంది కలుగుతుంది. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో ఈ సమస్య మరీ దారుణంగా ఉంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడ్డదిడ్డంగా పార్కింగ్

బస్టాండ్ కూడలి వద్ద, ప్రైవేటు వాహనాలు రోడ్డుపైనే అడ్డదిడ్డంగా ఆపడం వల్ల ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది.దీనికి తోడు రోడ్డు మార్జిన్లను ఆక్రమించి నిర్వహిస్తున్న దుకాణాల వల్ల రహదారి ఇరుకుగా మారిపోయింది.సాయంత్రం వేళల్లో నరకప్రాయం

పాఠశాలలు, కార్యాలయాలు ముగిసే సమయానికి (సాయంత్రం 5 నుండి 8 గంటల వరకు) వాహనాల రద్దీ ఒక్కసారిగా పెరుగుతోంది.రోడ్డు ఆక్రమణలను తొలగించి విస్తరణ పనులు చేపట్టాలి.

తక్షణమే సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి ఈ ట్రాఫిక్ కష్టాల నుండి విముక్తి ప్రసాదించాలని ప్రజలు కోరుతున్నారు

# మహాశివరాత్రి పర్వదినానికి ముస్తాబైన నగర శివాలయాలు

భక్తులకు సకల సౌకర్యాలు ఏర్పాటు చేసిన ధర్మకర్తల ఛైర్మన్లు, అధికారులు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 14**
మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నగరంలోని శివాలయాలు విద్యుత్ దీపాలంకరణలతో ముస్తాబు అయి విచ్చేసే భక్తులకు మౌలిక వసతుల ఏర్పాట్లతో సంసిద్ధంగా ఉన్నాయి. నగరంలో నగరంలోని శివాలయాలతో పాటు భక్తులు పుణ్య స్నానాలు ఆచరించేందుకు పుష్కర ఘాట్, కోటిలింగాల ఘాట్, మార్కండేయ ఘాట్ , సరస్వతి ఘాట్, గౌతమి ఘాట్, ధవలేశ్వరం లోని రామపాదాల రేవు ఘాట్ గోదావరి నది తీరాన ఉన్న అన్ని స్నానాల ఘాట్లు కార్పొరేషన్, రెవెన్యూ, పంచాయతీ అధికారులు సిద్ధం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత నగరంలోని నగరంలోని పలు దేవస్థానాలకు పరిపాలన కమిటీలు నియామకం జరిగింది. ఆదివారం తెల్లవారుజాము నుంచే శివాలయాలన్నీ భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేశాయి.

నగరంలో ప్రముఖ శివాలయాలుగా పేరుందిన మార్కండేయ స్వామి దేవస్థానం, శ్రీ కోటిలింగేశ్వర స్వామి దేవస్థానం, శ్రీ విశ్వేశ్వర దేవస్థానం, శ్రీ సారంగధరేశ్వర స్వామి దేవస్థానం, పలు దేవస్థానాల కమిటీల ఛైర్మన్లు పాలక మండళ్ళు భక్తులకు ఏర్పాట్లు చేశాయి. ఆయా శివాలయాల్లో భక్తులకు దర్శనం కోసం సాధారణ, ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. పిల్లలకు పాలు, భక్తులకు తాగునీరు, వృద్ధులకు వీలు చైర్లు , మహిళలు దుస్తులు మార్చుకునేందుకు గదులు వంటి ఏర్పాట్లు చేశారు. ఆలయాల్లో ఉదయం పూట ప్రత్యేక అభిషేకాలు, పూజలు, ఏకదశ రుద్రాభిషేకాలు, చతుర్వేద పారాయణాలు, లక్ష తులసి పూజ, లలిత సహస్ర పారాయణం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఆలయ ధర్మకర్తల చైర్మన్లు తెలిపారు. ఇలా ఉండగా పలు స్వచ్ఛంద సంస్థలు కూడా భక్తులకు పిల్లలకు, బిస్కెట్ ప్యాకెట్లు, వృద్ధులకు అవసరమైన త్రాగునీరు, ఆహార పోట్లలు, పాలు మజ్జిగ తదితర వితరణ కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ లు కొయ్యల రమణ, మదన్ సింగ్ పురోహిత్, బొలిశెట్టి శ్రీనివాసరావు, ఆలయాలు ఈ వోలు శోభారాణి, తదితరులు తెలిపారు.

# మాజీ ఎమ్మెల్యే ఈలి వరలక్ష్మి మృతి.

ఈలి వరలక్ష్మి కి నివాళులు అర్పించిన ప్రముఖులు, నాయకులు





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 14:**మాజీ రాష్ట్ర మంత్రివర్యులు స్వర్గీయ ఈలి ఆంజనేయులు గారి సతీమణి మాజీ శాసనసభ్యులు రాలు శ్రీమతి ఈలి వరలక్ష్మి (80 ) శనివారం మృతి చెందారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రి గా ఉన్న హయాంలో దేవా దాయ మంత్రి గా పనిచేశారు. ఆయన మృతి చెందిన తరువాత వచ్చిన ఎన్నికల లో ఆయన భార్య ఈలి వరలక్ష్మి పోటీ చేసి విజయం సాధించారు. ఈలి వరలక్ష్మి కుమారుడు ఈలి నాని పీఆర్పీ పార్టీ లో ఎమ్మెల్యే గా విజయం సాధించరు. వారి పార్థివ దేహాన్ని అన్ని పార్టీలు వారు సందర్శించి పూలమాలలతో నివాళులు అర్పిస్తూ వారి కుమారుడు మాజీ శాసనసభ్యులు ఈలి నాని ని ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాతో బాటు కూటమి నాయకులు బడుగు వెంకటేశ్వరరావు,వర్తనపల్లి కాశీ, పద్మనాభుని మురళీ, పాతురు పాతూరి రామ్ ప్రసాద్ చౌదరి, తన్నీడి షాలోమాన్ రాజు,కామిశెట్టి ఉమ శంకర్, ఏడుకొండలు ఉన్నారు. వైసీపీ నియోజకవర్గ ఇంచార్జి వడ్డీ రఘురామ్ ఈలి వరలక్ష్మి కి నివాళులు అర్పించారు

# జిల్లావ్యాప్తంగా మహాశివరాత్రి ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ క్షేత్రస్థాయి పరిశీలన



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 14:** మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం గోదావరి నదిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించే భక్తులకు అసౌకర్యం, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా జిల్లా పోలీస్ యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ శనివారం జిల్లా వ్యాప్తంగా ఉన్న గోదావరి ఘాట్ లను, శివాలయాలను సందర్శించి, క్షేత్రస్థాయిలో భద్రతా ఏర్పాట్లను అధికారులతో సమీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, శివరాత్రి సందర్భంగా గోదావరి ఘాట్లు , శివాలయాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని, డ్రోన్ కెమెరాలు , సోలార్ కెమెరాల తో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసామన్నారు. క్యూలైన్ల వద్ద ట్రాఫిక్ కు అంతరయం లేకుండా తగిన చర్యలు తీసుకున్నామని, అవసరమైన చోట తాత్కాలిక ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్లను ఏర్పాటు చేసామన్నారు. భక్తులు నదీ స్నానాలు చేసేటప్పుడు పోలీసులు జాగ్రత్తలు తప్పక పాటించాలని, సూచించిన ఘాట్ల వద్ద మాత్రమే పుణ్యస్నానాలు ఆచరించాలని, నది లోతు, ప్రవాహ వేగం తెలియ కుండా ప్రమాదాలకు గురికావద్దని సూచించారు.

కంట్రోల్ రూమ్ ద్వారా భక్తుల కదలికలను గమనిస్తూ సిబ్బంది ప్రజలకు పబ్లిక్ అడ్రెస్సింగ్ సిస్టం ద్వారా సూచనలు జారీ చేస్తామన్నారు.

బందోబస్తు లో భాగంగా గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శుల సేవలను కూడా పూర్తిస్థాయిలో వినియోగిస్తున్నామని, మహిళా భక్తులకు , చిన్నారులకు అండగా ఉంటారన్నారు. ప్రతి అధికారి, సిబ్బంది తమకు కేటాయించిన విధులను సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలన్నారు.అనుకోని సంఘటనలు జరిగితే వెంటనే కమాండ్ కంట్రోల్‌కు సమాచారం అందించా లన్నారు.సెక్టార్ అధికారులు తమ పరిధిపై పూర్తి అవగాహనతో ఇతర సెక్టార్లతో సమన్వయం చేసుకోవా లన్నారు.ట్రాఫిక్ సమస్యలు రాకుండా , రాంగ్ పార్కింగ్‌పై నిరంతర పెట్రోలింగ్ నిర్వహిం చాలన్నారు.సున్నిత ప్రాంతాల్లో స్పెషల్ సెక్యూరిటీ టీమ్స్ తో ముందస్తు భద్రత తనిఖీలు నిర్వహించాలన్నారు.

పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాల సక్రమ నిర్వహణ, దిశా నిర్దేశక బోర్డుల ఏర్పాటు చేయాలన్నారు.విధులకు హాజరయ్యే సిబ్బంది తప్పనిసరిగా ఐడీ కార్డులు, విజిల్స్ లాఠీ కలిగి ఉండాలన్నారు.

ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# గోమాతలో సకల దేవతలు కొలువై ఉన్నారు. మెంటర్ కళ్యాణి.



**గోపాలపురం, పెన్ పవర్, ఫిబ్రవరి 14.**
హిందువులు దైవంగా కొలిచే గోమాతలో సకల దేవతలు కొలువై ఉన్నారని ఇస్కాన్ పాఠశాల లివ్ గీత లెర్న్ గీత మెంటర్ వెలగా కళ్యాణి ప్రసాద్ అన్నారు. ఫిబ్రవరి 14 కౌ హగ్ దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని వాదాలకుంట గ్రామంలో గోమాతలను పెంచే దళిత రైతులకు పూజ్య గురువులు డాక్టర్ శ్రీ లక్ష్మీ దర్ ఆదేశాల మేరకు గోమాత ఆహారం (థానా) ను కళ్యాణి ప్రసాద్ దంపతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోవు తల్లితో సమానమని అందుకే గోమాతని పిలుస్తూ ఉంటారన్నారు. సాక్షాత్తు శ్రీకృష్ణ భగవానుడు వారు గోవులను కాస్తూ ఉండేవారన్నారు. అన్ని శుభ లక్షణములు గూగుల్ లోనే దర్శనమిస్తాయన్నారు. తల్లి పాలు తరువాత అత్యంత శ్రేష్టమైనవి గోమాత పాలని తెలిపారు. గోమాతను అత్యంత భక్తిశ్రద్ధలతో పూజిస్తే మోక్షం సిద్ధిస్తుంది అన్నారు. కొన్ని ప్రదేశాల్లో గోవు యొక్క మలమూత్రాలను ఔషధంగా భావించి వాటిని ఎంతో భక్తి శ్రద్ధలతో సేవిస్తూ ఉంటారన్నారు. అయితే నీటి సమాజంలో గోమాతల సంఖ్య రోజురోజుకి తగ్గిపోతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పూర్వకాలంలో కేవలం గోవులను మాత్రమే పెంచి పోషించే వారిని ప్రస్తుతం రైతులు ఆ దిశగా అడుగులు వేస్తూ గోవులను సంరక్షిస్తూ వాటి సంఖ్యను దినదిన అభివృద్ధి చేయాలని కళ్యాణి ప్రసాద్ కోరారు. ఈ కార్యక్రమంలో వెలగా లక్ష్మణరావు, పలివెల రమేష్, జాను పాటి వెంకటరత్నం, వంశీ, రాజా తదితరులు పాల్గొన్నారు.

# వై.సి.పి.పార్టీ మండల కమిటీ సమావేశం

-రానున్న పంచాయితీ ఎన్నికల్లోఎం.పి.పి.జడ్పిటిసి,ను కైవసం చేసుకోవాలి.వై.సి.పి.




**వి.ఆర్.పురం పెన్.పవర్. ఫిబ్రవరి.14:**మండలంలోని రేఖపల్లి,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద శనివారంవై.సి.పి.మండలనాయకులు చిన్నమట్టపల్లి పంచాయితీ సర్పంచ్ పిట్టా రామారావు అధ్యక్షతనలో ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సమావేశంలో వి.ఆర్.పురం మం డలంలో కొత్తగా ఎన్నుకోబడిన వైస్ మండల ప్రెసి డెంట్, ఎస్.సి.ఎస్.టి.బి.సి.యూత్ రైతు సంఘాల అనుబంధ సంఘాల అధ్యక్షులు మహిళా మండలి అధ్యక్షులు ను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎమ్మెల్సీ అనంత బాబు రంపచోడవరం నియోజకవర్గం కోఆర్డినేటర్,మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి,సూచనల మేరకు వైస్సార్సీపీ కేంద్రకార్యాలయం తాడేపల్లి నుంచి రాష్ట్ర పార్టీ పంపించిన సభ్యుల పేర్లను వై.సి.పి.పార్టీ మండల అధ్యక్షులు మాదిరెడ్డి సత్తిబాబు,కార్యకర్తల సమావేశంలో చదివివినిపించారు.ఈ సందర్బంగా వై.సి.పి.పార్టీ మండల అధ్యక్షులుమాదిరెడ్డి సత్తిబాబు,ఆర్.టి.ఐ.విభాగం జిల్లా అధ్యక్షులు బొడ్డు సత్యనారాయణ,మాట్లాడుతూ కూట మి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి,వై.సి.పి.పార్టీ నాయకులను అరెస్ట్,లు చేయటమే, ప్రజాగొంతు నొక్కటమే పనిగా పెట్టుకున్నారని,రానున్న రోజులలో కూటమి ప్రభుత్వంఅవలంబిస్తున్న విధానాలను ఎండ కట్టాలని,ప్రజా సమస్యలను పరిష్కరించుటకై అవ సరమైతే ప్రజల పక్షాన పోరాడటానికి సిద్ధంగా ఉండాలని, పిలుపునిచ్చారు.వై.సి.పి.పార్టీలో ఎన్నుకోబడిన కమిటీ సభ్యులు అంతా కూడా ప్రతిక్షణం కార్యకర్తలకు అండగా ఉంటూ పార్టీబలోపేతానికి కృషిచేయాలని,రానున్న కాలం లో వచ్చే పంచాయతీ ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు అధిక సంఖ్యలో గెలిపించు కోవా లని,ఎం.పీ.పీ జడ్పిటిసి,లను కైవసంచేసుకోవాలని,కార్య కర్తలకు సూసించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ గ్రీవెన్స్ అధ్యక్షులు ముత్యాల మురళి,జిల్లాఅధికార ప్రతి నిధి చిక్కాల బాలు,వై.సి.పి.నాయకులు పిట్టా రామారా వు,కోటం జయరాజు,బందం రాజు,వడ్డాణపు చిన రాజా రావు,రేవు బాలరాజు,గూటలా ముత్యారావు,రేఖపల్లిఎస్.సి.కాలనీ యూత్ సభ్యులు రిషి రాజేంద్ర,రవీంద్ర,ముత్యా ల జైరాజు,సున్నం రాజు,పండా బుచ్చిరాజు,గుంపెనపల్లి వీరయ్య,గుజ్జా రాజేశ్వరి,గుంపెనపల్లి చైతన్య,ముత్యాల సుమన్,ఆసులక్ష్మణ్,సోడి రాజబాబు,సోడి చిరంజీవి,గణి త్రిరామకృష్ణ,కడుపు సాయి,తదితరులు పాల్గొన్నారు.

# ఈలి వరలక్ష్మి గారి పార్థివదేహానికి నివాళులు అర్పించిన వైఎస్సార్ సీపీ ఇంచార్జి వడ్డి రఘురామ్ నాయుడు.



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 14.**ఈలి ఆంజనేయులు గారి సతీమణి తాడేపల్లిగూడెం మాజీ శాసనసభ్యులు ఈలి వెంకట మధుసూధన్ రావు(నాని) గారి తల్లిగారు మాజీ శాసన సభ్యురాలు ఈలి వరలక్ష్మి (80) అనారోగ్యంతో కన్నుమూశారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ వడ్డి రఘురామ్ నాయుడు గారు ఈలి వరలక్ష్మి గారి పార్థివదేహానికి నివాళులు అర్పించి, వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కోరుకున్నారు. వారి కుమారుడు మాజీ శాసన సభ్యులు ఈలి నాని గారిని పరామర్శించి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరుపున ప్రగాఢ సానుభూతి తెలియపరిచారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# శ్రీ ఆదర్శ దివ్యాంగుల ఆశ్రమంలో డాక్టర్ బాబుల జన్మ దిన వేడుకలు





**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 14:**సీతానగరం రమేష్ (డాక్టర్ బాబు) పుట్టినరోజు వేడుకలను నామవరం (శాటిలైట్ సిటీ ) పుణ్యక్షేత్రం గ్రామ శివారులలో ఉన్న శ్రీ ఆదర్శ దివ్యాంగుల ఆశ్రమంలో ఘనంగా నిర్వహించు కున్నారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో ఉన్న దివ్యాంగులకు టిఫిన్స్ , భోజనాలు అందజేశారు. ఆశ్రమంలో దివ్యాంగులకు ఉపయోగపడే గ్యాస్ స్టవ్, రెండు ఫ్యాన్లు అందజేసి ఆయన సేవ తత్వాన్ని నిరూపించుకున్నారు. రమేష్ చేసిన సేవల్లో ఈ కార్యక్రమమాన్ని పలువురు అభినందించారు. రమేష్ ( డాక్టర్ బాబులు ) ఇటువంటి పుట్టిన రోజులు ఎన్నో జరుపుకోవాలని, ఆ భగవంతుడు ఆరోగ్యం, ఇతరులకు సహాయం చేసే ఐశ్వర్యం కలగజేయాలని ఆకాంక్షించారు. రమేష్ కుటుంబ సభ్యులను, బంధువులను, స్నేహితులను భగవంతుని ఆశీస్సులు కలగజేయాలని ఆశ్రమ దివ్యాంగులు వేడుకున్నారు.

## ధన శివలింగాన్ని దర్శించుకున్న కరాటం,సువర్ణ రాజు



**గోపాలపురం,పెన్ పవర్ ఫిబ్రవరి 14 :**మండలంలోని కొవ్వూరుపాడు గ్రామానికి చెందిన చిలక సాయి తేజ రూపొందించిన ధన శివలింగాన్ని మాజీ డిసిసిబి చైర్మన్ కరాటం రాంబాబు,జనసేన పార్టీ గోపాలపురం నియోజకవర్గం ఇంచార్జ్ దొడ్డిగర్ల సువర్ణ రాజు శనివారం దర్శించుకున్నారు.లక్ష 25 వేల రూపాయల విలువచేసే నానాలతో ఈ శివలింగాన్ని సాయి తేజ రూపొందించారు.ఆ విషయం ఆ నోట ఈ నోట ప్రజలకు తెలియడంతో భక్తులు తండోపతండాలుగా శివలింగం వద్దకు వెళ్లి దర్శించుకుని పూజలు నిర్వహిస్తున్నారు.అందులో భాగంగానే జనసేన నాయకులు అధిక సంఖ్యలో తరలి శివలింగాన్ని దర్శించుకుని దానిని రూపొందించిన సాయి తేజను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సాయి తేజ ప్రముఖ జనసేన నాయకులైన కరాటం రాంబాబు దొడ్డిగర్ల సువర్ణ రాజుల ఆశీస్సులను అందుకున్నారు.అలాగే శనివారం మధ్యాహ్నం జనసేన పార్టీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి సైతం శివలింగాన్ని దర్శించుకున్నారు.ఈ ధన శివలింగాన్ని ఆదివారం పట్టిసీమలో ఉన్న వీరభద్రుడి ఆలయం వద్ద ప్రతిష్టించనున్నామని అన్నారు.ఊరేగింపుగా తీసుకెళ్లే ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిలక లక్ష్మణస్వామి,జనసేన నల్లజర్ల మండల అధ్యక్షులు చోడసాని బాపిరాజు,మద్దాల కాశీ విశ్వనాథ్ సనారి,పోసిన గణపతి తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ద

## విద్యుత్ తీగలు తగిలి గడ్డి ట్రాక్టర్ దగ్ధం

గ్రామస్తుల అప్రమత్తంతో తప్పిన పెను ప్రమాదం





**వై రామవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 14:** ప్రమాదవశాత్తు లోడుతో వెళ్తున్న గడ్డి ట్రాక్టర్ కు విద్యుత్తు తీగలు తగిలి మంటలు చెలరేగాయని, గ్రామస్తులు అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం తప్పిందని పెదఊలెం పాడు గ్రామస్తులు తెలిపారు.

గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో గడ్డిలోడుతో వస్తున్న ట్రాక్టర్ పక్కనే ఉన్న కారును తప్పించబోయి, విద్యుత్తు తీగలు తగిలాయని మంటలు చెలరేగడంతో వెంటనే గ్రామస్తులందరూ అప్రమత్తం కావడంతో గ్రామం నడిబొడ్డు నుండి ట్రాక్టర్ డ్రైవర్ ను హెచ్చరించడంతో గ్రామం పొలిమేరకు తీసుకొని వెళ్లారని, వెంటనే ట్రాక్టర్ దద్దమ్మయిందని తెలిపారు. గ్రామం మధ్యలో ట్రాక్టర్ దగ్ధమై ఉంటే పెను ప్రమాదం సంభవించేదని, గ్రామస్తులు అప్రమత్తం కావడంతో ప్రమాదం తప్పిందని తెలిపారు. ప్రతి సంవత్సరం గడ్డిని కాకినాడ తరలించుకు వెళ్లేవారని, శనివారం ట్రాక్టర్ బయల్దేరిన సమయంలో ఇటువంటి సంఘటన జరిగిందని గ్రామస్తులు తెలిపారు. కనీసం గడ్డి ట్రక్ నుండి ఇంజన్ ను వేరు చేద్దామన్న మంటలు చెలరేగడంతో ట్రాక్టర్ లోడ్ తో పాటు కాలి బూడిద అయిందని తెలిపారు. రంపచోడవరం నుండి ఫైర్ ఇంజన్ వచ్చి మంటలను ఆర్పిందని అన్నారు. ట్రాక్టర్ లో 40 వేల రూపాయలు నగదు ఉందని, మంటల్లో కాలిపోయిందని ట్రాక్టర్ యజమాని తెలిపారని అన్నారు.

# శివరాత్రి ఏర్పాట్లు పరిశీలించిన అదనపు పోలీసు అధికారి బొడ్డు హేమంత్ కుమార్



**చింతూరు పెన్ పవర్ 14:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని చట్టి గ్రామంలోని గాదె రామలింగేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న ఏర్పాట్లను చింతూరు అదనపు పోలీసు అధికారి బొడ్డు హేమంత్ కుమార్ శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. మహాశివరాత్రి సందర్భంగా ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆలయ కమిటీకి సూచించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు ఆదేశించారు. ముఖ్యంగా జాతీయ రహదారి 30పై రాకపోకలు సజావుగా సాగేందుకు తగిన చర్యలు తీసుకోవాలని చింతూరు పోలీసు అధికారి రమేష్‌కు సూచించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, భక్తులకు సురక్షిత వాతావరణం కల్పించాలని కోరారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ
మరిన్ని వివరాలకు సంప్రదించండి
93948 55244
షరతులు వర్తిస్తాయి

## లచ్చిగూడెం పంచాయతీలో జనసేన జోరు

ఘనంగా పంచాయితీ కమిటీ ఏర్పాటు, ఎన్నికల దిశగా కదం తొక్కిన కార్యకర్తలు







**చింతూరు, పెన్ పవర్ ఫిబ్రవరి 14:** లచ్చిగూడెం పంచాయతీ పరిధిలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో పంచాయతీ కమిటీ ఏర్పాటు కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. తీగల కవిత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పంచాయతీకి చెందిన నాలుగు గ్రామాల కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ అధ్యక్షుడిగా కొవ్వసి వెంకటేష్, కార్యదర్శిగా బొగ్గా కన్నారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రానున్న సర్వత్ర ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి కార్యకర్త ఉత్సాహంగా పనిచేసి పార్టీని బలోపేతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సీనియర్ నాయకులు పేయాల నాగేశ్వరావు, మండల ఉపాధ్యక్షుడు తీగల రవి, ప్రధాన కార్యదర్శి బేడే సతీష్, నాలుగు గ్రామాల అధ్యక్షులు, కార్యదర్శులు గ్రామ పెద్దలు పూజారులు తదితరులు పాల్గొన్నారు.

## రాజంపాలెంలో ఘనంగా షిరిడి సాయి వార్షిక మహోత్సవాలు

**గోపాలపురం,పెన్ పవర్ ఫిబ్రవరి 14 :**మండలంలోని రాజంపాలెం గ్రామ శివారులో కొలువై ఉన్న శ్రీ షిరిడి సాయిబాబా వారి ఆలయంలో 21వ వార్షిక మహోత్సవం వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి.సాయి పురోహిత్ అద్దూరి రామారావు ఆధ్వర్యంలో పూజ్య గురువులు అమ్ముల సాంబశివరావు ఆశీర్వాదాలతో ప్రతి ఏటా మూడు రోజుల్లో పాటు ఈ ఉత్సవాలు జరుగనున్నాయి.ఈ ఆలయం వద్ద నూరు అడుగుల సాయి స్థూపాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.రాష్ట్రవ్యాప్తంగా అతి తక్కువ నూరు అడుగుల స్థూపాలు ఉండగా అందులో ఈ ఆలయం ఒకటి.ప్రతీ ఏటా జరిగే ఈ ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి బాబావారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరిస్తారు.ఉత్సవాలలో భాగంగా చివరి రోజు(ఆదివారం) భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించనున్నారు.భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరిస్తూ ఉంటారు.శివరాత్రి పర్వదినం రోజు ఈ ఉత్సవాలు జరుగుతూ ఉండడంతో పట్టిసీమ శివరాత్రి ఉత్సవాలకు వెళ్లే భక్తులు ముందుగా బాబా వారి ఆలయానికి వచ్చి ఆయనను దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించి సాయంత్రం సమయంలో పట్టిసీమ వెళుతూ ఉంటారు.ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించడంతో పాటు భక్తుల సౌకర్యార్థమై త్రాగునీరు వసతి లను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.



# యువత వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి-ఎంపీపీ సత్యనారాయణ



**గోపాలపురం,పెన్ పవర్,ఫిబ్రవరి 13**
యువత వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ జీవితంలో స్థిరపడాలని గోపాలపురం ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ సూచించారు. మండల మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ, వికాస ఆధ్వర్యంలో జాబ్ మేళా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. స్థానిక శర్వాణి పాఠశాల ఆవరణలో సంస్థ మండల శాఖ చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు, అధ్యక్షులు రాపాక ఫణి కిషోర్ ల ఆధ్వర్యంలో జరిగిన ఈ మేళాను ఎంపీడీవో జి రాజ్ మనోహర్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా అధ్యక్షులు ఖండేపు సూర్యనారాయణ లు సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ యువత ఉన్నతమైన చదువులు చదివి ఉద్యోగం రాలేదని నిరాశ చెందకూడదు అని హితవుపలికారు. రెట్టించిన ఉత్సాహంతో పోటీ పరీక్షలకు సిద్ధము కావాలి అన్నారు. అలాగే వివిధ సంస్థలు పెట్టే జాబ్ మేళా కార్యక్రమంలో పాల్గొని తమ ప్రతిభను కనబరిచి ఉద్యోగాలను సొంతం చేసుకోవాలన్నారు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ అనుకున్న లక్ష్యాలను సాధించాలని అన్నారు. ప్రభుత్వ,ప్రభుత్వేతర ఉద్యోగాలు అనే వ్యత్యాసం లేకుండా ఉద్యోగంలో చేరి తరువాత అనుకున్న లక్ష్యాలను సునాయాసంగా సాధించ వచ్చని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సూర్యనారాయణ మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో వివిధ రకాల సేవా కార్యక్రమాలతో పాటు యువతకు ఉపాధి కల్పించే ఉద్యోగ మేళాలను ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. జిల్లా బ్లడ్ బ్యాంక్ డైరెక్టర్ జోడాల వెంకట్ మాట్లాడుతూ శనివారం జరిగిన జాబ్ మేళాకు 246 మంది నిరుద్యోగులు హాజరయ్యారు అన్నారు. వారిలో వివిధ కంపెనీలకు 103 మంది ఎంపిక కాబడ్డారన్నారు. వారంతా అతిథులు చేతుల మీదుగా ఉద్యోగ అనుమతి పత్రాలను అందుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు తో పాటు మానవత మండల కార్యదర్శి సూర్యచంద్రం, కన్వీనర్ కృపాకర్ రెడ్డి, కో చైర్మన్ నెల్లి చంద్రశేఖర్, కీర్తి కుమార్, రాధాకృష్ణ, సిఆర్పి కొయ్య నాగరాజు, గుబ్బ లక్ష్మణరావు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రతి ఘాట్‌లో వైద్య శిబిరాలు, సమాచారా కేంద్రాలు



– ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 14:** మహాశివరాత్రిని పురస్కరించుకుని గోదావరి నది పుణ్య స్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మహాశివరాత్రి సందర్భంగా గోదావరి గట్టున మార్కండేయస్వామి ఆలయం, పుష్కర ఘాట్, కోటిలింగాల ఘాట్, కోటిలింగాల దేవస్థానం, సారంగధర మెట్ట ఆలయాలను శనివారం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సందర్శించి భక్తుల కోసం చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ . ప్రతి ఘాట్‌లో వైద్య శిబిరాలు, సమాచార కేంద్రాలు, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు సిద్ధంగా ఉన్నాయని, ఘాట్‌ల పరిశుభ్రతపై సంతృప్తి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు, నగర పాలక సంస్థ అధికారులకు సూచించారు. ఆలయాలకు వచ్చే భక్తులు తోపులాట లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆలయ కమిటీలకు సూచించారు. భక్తుల కోసం ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనాలను ప్రసాదాలుగా వితరణ చేసే స్వచ్ఛంద సంస్థలు ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. టీడీపీ నాయకులు, ఆలయ కమిటీల చైర్మన్లు, సభ్యులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

# టీ20 వరల్డ్ కప్‌లో అరుదైన రికార్డు... ఫిఫ్టీ బాదిన పెద్ద వయస్కుడిగా కలీమ్

**టీ20 ప్రపంచకప్‌లో సరికొత్త చరిత్ర సృష్టించిన ఆమిర్ కలీమ్**

**44 ఏళ్ల వయసులో హాఫ్ సెంచరీ చేసిన అత్యంత పెద్ద వయస్కుడిగా రికార్డు**

**ఐర్లాండ్‌పై 28 బంతుల్లో 50 పరుగులు చేసిన ఒమన్ ఆల్ రౌండర్**

**ఆమిర్ రికార్డు ఇన్నింగ్స్ ఆడినా మ్యాచ్‌లో ఓడిపోయిన ఒమన్**




**హైదరాబాద్ పెన్ పవర్:** ఒమన్ ఆల్ రౌండర్ ఆమిర్ కలీమ్ టీ20 ప్రపంచకప్ చరిత్రలో తన పేరును లిఖించుకున్నాడు. టీ20 ప్రపంచకప్‌లో హాఫ్ సెంచరీ చేసిన అత్యంత పెద్ద వయస్కుడిగా శనివారం రికార్డు సృష్టించాడు. ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈ ఘనత సాధించాడు. ఆమిర్ కలీమ్ వయసు 44 ఏళ్ల 86 రోజులు. సింహాళీస్ స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో, ఐర్లాండ్ నిర్దేశించిన 236 పరుగుల భారీ లక్ష్యఛేదనలో ఒమన్ తరఫున ఆమిర్ ఇన్నింగ్స్ ప్రారంభించాడు. కేవలం 28 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్ల సహాయంతో 50 పరుగులు పూర్తి చేశాడు. ఓ వైపు వికెట్లు పడుతున్నా, హమ్మద్ మిర్జాతో కలిసి 73 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. అయితే, బారీ మెక్‌కార్తీ వేసిన పదునైన బౌన్సర్‌కు ఔటయ్యాడు.

ఈ హాఫ్ సెంచరీతో, తన సహచర ఆటగాడు మహ్మద్ నదీమ్ నెలకొల్పిన రికార్డును ఆమిర్ అధిగమించాడు. ఇదే టోర్నమెంట్‌లో శ్రీలంకపై నదీమ్ 43 ఏళ్ల 161 రోజుల వయసులో హాఫ్ సెంచరీ చేసి ఈ రికార్డును నెలకొల్పాడు. ఈ జాబితాలో శ్రీలంక దిగ్గజం సనత్ జయసూర్య (39 ఏళ్ల 345 రోజులు) మూడో స్థానంలో ఉన్నాడు.

ఆమిర్ రికార్డు ఇన్నింగ్స్ ఆడినప్పటికీ, ఒమన్ జట్టును గెలిపించలేకపోయాడు. అతను ఔటైన తర్వాత ఒమన్ ఇన్నింగ్స్ కుప్పకూలింది. 18 ఓవర్లలో 139 పరుగులకే ఆలౌట్ కావడంతో ఐర్లాండ్ 96 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఇటీవలే టీ20 ప్రపంచకప్‌లో పాల్గొన్న అత్యంత పెద్ద వయస్కుడిగా కూడా ఆమిర్ రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే.

# దీదీబాదుడుకు బ్రేక్.. టెన్త్ క్లాస్ ఎగ్జామ్స్‌శ్రీ రాయనున్న వైభవ్ సూర్యవంశీ !




**హైదరాబాద్ పెన్ పవర్:** అతను బ్యాట్ పడితే సిక్సరే. స్పిన్ బౌలింగ్ అయినా.. పేస్ బౌలింగ్ అయినా.. ఈ చిచ్చరపిడుగుకు తెలిసిందల్లా అటాకింగ్ బ్యాటింగ్ ఒక్కటే. బ్యాట్ పడితే బాదుడే. ఫాస్టెస్ట్ సెంచరీల స్పెషలిస్ట్. ప్రత్యర్థి జట్టు బౌలర్లకు పట్టపగలే చుక్కలు చూపిస్తున్న యువ తేజం వైభవ్ సూర్యవంశీ పదో తరగతి పరీక్షలు రాయడానికి ప్రిపేర్ అవుతున్నాడు.

బ్యాట్‌ఎకు రెస్ట్ ఇచ్చి పుస్తకాలను ముందేసుకుని కుస్తీ పడుతున్నాడు. ఫిబ్రవరి 17వ తేదీ నుంచి బీహార్‌శ్రీలో టెన్త్ క్లాస్ ఎగ్జామ్స్ జరగబోతున్నాయి. బీహార్‌శ్రీలోని సమస్తిపూర్ పోడార్ ఇంటర్నేషనల్ స్క్శ్రీలో వైభవ్ సూర్యవంశీ టెన్త్ క్లాస్ ఎగ్జామ్స్ రాయబోతున్నాడు. క్రికెట్ ప్రపంచానికి కొన్నాళ్లు దూరంగా.. పెన్నూపుస్తకాలకు దగ్గరగా సూర్యవంశీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాడు. అకడమిక్ పిచ్‌శ్రీలో సిక్సులు, ఫోర్లు కొట్టాల్సిన టైమొచ్చింది. క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ తమ పాఠశాలలో 10వ తరగతి బోర్డు పరీక్షలకు హాజరు కానున్నాడని పోడార్ ఇంటర్నేషనల్ స్క్ ప్రిన్సిపాల్ తెలిపారు. అతనికి ఇప్పటికే అడ్మిట్ కార్డు అందిందని, ఉపాధ్యాయులు, విద్యార్థులు అందరూ అతనిని చూసేందుకు ఉత్సాహంగా ఉన్నారని చెప్పారు. అయితే, అతను ఇప్పటికీ విద్యార్థేనని.. పరీక్షకు హాజరు కానున్నందున.. ఆ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని తాము ఏర్పాట్లు చేశామని స్కూల్ ప్రిన్సిపాల్ చెప్పారు. ఇది క్రికెట్ పిచ్ కాదు, అకడమిక్ పిచ్ అని గుర్తుచేశారు. విద్యార్థులు పరీక్షలు రాసే సమయంలో అందరినీ సమానంగా చూస్తామని.. అన్ని సౌకర్యాలు అందరికీ ఒకేలా ఉంటాయని ప్రిన్సిపాల్ నీల్ తెలిపారు.

# ఇలా చేస్తే పక్కా భారత్ ఓడిపోతుంది.. పాక్ జట్టుకి షాహిద్ అఫ్రిది కీలక సూచనలు






**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్ 2026లో కోలంబోలో రేపు ( ఫిబ్రవరి 15న) జరగనున్న భారత్ పాకిస్థాన్ హై-వోల్టేజ్ మ్యాచ్‌కు ముందు పాక్ మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రిది కీలక సూచనలు చేశారు. ఈ మ్యాచ్‌లో విజయం సాధించాలంటే పెద్ద షాట్లు లేదా షాకింగ్ ప్లేయర్ అవసరం లేదు, కేవలం బేసిక్స్‌ను సరిగ్గా పాటిస్తే సరిపోతుందని అన్నారు. పాకిస్థాన్ జట్టులో మంచి డెప్త్ ఉంది.. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ ఈ మూడు విభాగాల్లో తక్కువ తప్పులు చేయడమే మన జట్టు విజయానికి ముఖ్యం అని స్పష్టం చేశారు. తప్పులు అందరూ చేస్తారు.. కానీ తక్కువ తప్పులు చేసే జట్టు మాత్రమే గెలుస్తుంది అని పాకిస్థాన్ మాజీ క్రికెటర్ షాహిద్ అఫ్రిది తెలిపారు. బ్యాటింగ్ విషయానికి వస్తే, మొదటి వికెట్లు పడినా భయపడాల్సిన అవసరం లేదు.. మిడిల్ ఆర్డర్ లో మంచి బ్యాటర్లు ఉండటంతో జట్టు తిరిగి నిలబడే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. ఇన్నింగ్స్ ఆరంభంలో జాగ్రత్తగా ఆడి స్కోర్ బోర్డును ముందుకు తీసుకెళ్లాలి.. చివరి ఓవర్లలో పవర్ హిట్టింగ్ తో పరుగుల వేగం పెంచాలని అఫ్రిది సూచించారు. ప్రత్యేకంగా పాకిస్థాన్ జట్టు ఓపెనర్లకు షాహిద్ అఫ్రిది ఓ సలహా ఇచ్చారు. రన్ రేట్ పెంచే ప్రయత్నం చేయాలి కానీ తొందరపడి వికెట్లు కోల్పోవద్దని హెచ్చరించాడు. జట్టు సమతుల్యంగా ఆడితే మంచి ఆరంభం దక్కుతుందని పేర్కొన్నాడు. మొత్తానికి, షాహిద్ అఫ్రిది చెప్పిన ప్రకారం, భారీ షాట్ల కంటే కూడా బేసిక్ అంశాల్లో పటిష్టంగా ఉండటం వలన ఇలాంటి కీలక మ్యాచ్‌లో పాకిస్థాన్ విజయం సాధించడానికి ఈజీ అవుతుందని క్రికెట్ విశ్లేషకులు తెలియజేస్తున్నారు.

**ఈ చిత్రాలలో దిశా పటాని చాలా స్టైలిష్‌గా ఉంది**



# హీట్ పెంచిన సంయుక్త.. అందాలతో అదరహో అనిపిస్తూ!

ఇటీవల కాలంలో హీరోయిన్స్ ఒకరి తర్వాత ఒకరు సోషల్ మీడియాలో గ్లామర్ వలకబోస్తూ తమ పాపులారిటీ సంపాదించుకుంటున్నారు. అందులో భాగంగానే తన అందంతో, అమాయకత్వంతో ఒకప్పుడు కట్టు బొట్టుతో సాంప్రదాయంగా కనిపించిన హీరోయిన్స్.. ఇప్పుడు ఏకంగా గ్లామర్డోస్ పెంచేసి హీట్ పుట్టిస్తూ అందాలతో అదరహో అనిపిస్తుంది .ఆమె ఎవరో కాదు



అందాల తార సంయుక్త మీనన్. పవన్ కళ్యాణ్, రానా కాంబినేషన్లో వచ్చిన భీమ్లా నాయక్ సినిమాతో రానా సరసన హీరోయిన్గా తెలుగు తెరకు పరిచయమైంది. మొదటి సినిమాతో అందరి దృష్టిని ఆకట్టుకున్న ఈమె.. ఆ తర్వాత బింబిసారా సినిమాలో పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించి మెప్పించింది. ఇక ఈ మధ్యకాలంలో వరుస పెట్టి అవకాశాలు అందుకుంటూ ప్రేక్షకులను అలరిస్తున్న సంయుక్త మీనన్.. తాజాగా గ్లామర్ డోస్ పెంచేసి సోషల్ మీడియా ద్వారా కొన్ని ఫోటోలను పంచుకుంది. స్లీవ్ లెస్.. ఫ్రంట్ డీప్ వీక్ కలిగిన బ్లాక్ అనార్కలి డ్రెస్ ధరించిన ఈమె అందులో సైడ్ కట్ అందాలతో అభిమానులను ఉక్కిరిబిక్కిరి చేసింది. ఎప్పుడు చీరకట్టులో కనిపించే సంయుక్త మీనన్ ఇలా హీట్ పెంచుతోంది ఏంటి అంటూ అభిమానులు కూడా ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి అయితే సంయుక్త మీనం షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. ఇది చూసిన అభిమానులు.. నన్ను పెళ్లి చేసుకుంటావా అని ఒక అభిమాని అడిగితే.. ఇంకొకరు నీ అందానికి ఎంతటి వారైనా ఫిదా అవ్వాల్సిందే అంటూ కామెంట్ చేస్తున్నారు. మొత్తానికైతే ఇలా ఈమె అందాలపై అభిమానులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తూ ఉండడం గమనార్హం. సంయుక్త మీనన్ చివరిగా తెలుగులో శర్వానంద్ తో కలిసి నారి నారి నడుమ మురారి సినిమాలో హీరోయిన్ గా నటించింది. ఇందులో సాక్షి వైద్య మరో హీరోయిన్గా నటించిన విషయం తెలిసిందే. సంక్రాంతి సందర్భంగా విడుదలైన ఈ సినిమా సరైన థియేటర్లు దొరకక కలెక్షన్లు సొంతం చేసుకోలేదు కానీ కంటెంట్ పరంగా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ఇటు అమెజాన్ ప్రైమ్ వేదికగా ఓటీటీ స్ట్రీమింగ్ కి కూడా వచ్చేసింది. ఇక్కడ ఆడియన్స్ను అలరిస్తున్నట్లు సమాచారం.సంయుక్త తదుపరి చిత్రాల విషయానికి వస్తే.. ఈ ఏడాది సంక్రాంతికి మంచి విజయాన్ని తన ఖాతాలో వేసుకున్న ఈ ముద్దుగుమ్మ.. నిఖిల్ సిద్ధార్థ హీరోగా నటిస్తున్న స్వయంభూ సినిమాలో హీరోయిన్గా నటిస్తోంది. ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. హిస్టారికల్ జానర్ లో వస్తున్న ఈ సినిమాపై అంచనాలు భారీగానే నెలకొన్నాయి. మరొకవైపు విజయ్ సేతుపతి, పూరీ జగన్నాథ్ కాంబినేషన్లో వస్తున్న సినిమాలో కూడా ఈమె హీరోయిన్గా అవకాశాన్ని అందుకుంది. అంతేకాదు ది బ్లాక్ గోల్డ్ అనే ఉమెన్ సెంట్రిక్ యాక్షన్ మూవీలో కూడా సంయుక్త నటిస్తోంది. ఒకవైపు వరుస చిత్రాలతో బిజీగా ఉంటూనే మరొకవైపు ఆడియన్స్ ను అలరించడానికి ఇలా సోషల్ మీడియా వేదికగా అందాలు ఆరబోస్తూ ఫాలోవర్స్ ను పెంచుకుంటుంది సంయుక్త.

**మడోన్నా సెబాస్టియన్ యొక్క పూల సెరినిటీ: ఎ డ్రీమీ ఎస్కేప్**



Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965